PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 79 | విజయవాడ, గురువారం 19 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 19 October 2023 | Rs

ఈ నెల 24 సాధారణ సెలవు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయదశమి సందర్భంగా ఈ నెల 24న సాధారణ సెలవుగా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి జిఓ 2047ను బుధవారం జారీ చేశారు. ఈ నెల 24వ తేదీని గతంలో ఐచ్ఛిక సెలవు (ఒహెచ్)గా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు సాధారణ సెలవుగా ప్రకటించింది.

ఓటమి ఎరుగని కివీస్

- ఆఫ్ఘనిస్తాన్‌పై 149పరుగుల తేడాతో ఘన విజయం
- వరుసగా నాల్గో మ్యాచ్‌లోనూ గెలుపుతో టాప్‌లోకి..

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సంపూర్ణ పోషణపై సమీక్షలో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు

పటిష్టంగా సంపూర్ణ పోషణ

- అమలుపై నిశిత పరిశీలన
- అధికారులకు ముఖ్యమంత్రి జగన్ నిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంపూర్ణ పోషణ కార్యక్రమం అమలును నిశితంగా పరిశీలించాలని, అంగన్‌వాడీల వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న దానిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమశాఖపై సిఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ పోషణ్, అంగన్‌వాడీలపై బలమైన ఎస్‌ఒపిని రూపొందించాలని తెలిపారు. డ్రైరేషన్ పంపిణీపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఇప్పుడు అమలవుతున్న విధానంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అన్నారు. రేషన్ నాణ్యత విషయంలో ఎక్కడా లోపాలు ఉండకూదని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి రక్తహీనత, పౌష్టికాహారలోపం ఉన్నవారిని గుర్తించి వారందరికీ పౌష్టికాహారం అందేలా మహిళా శిశు సంక్షేమశాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. మందులు ఇచ్చే బాధ్యత ఆరోగ్యశాఖ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. దీనివల్ల గ్రామస్థాయిలో రక్తహీనత సమస్యను పూర్తిగా నివారించగలుగుతామని పేర్కొన్నారు. సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారం అందిస్తున్న సమయంలో గర్భిణులు, పిల్లలకు టీకాలు అందించారా, లేదా అన్న దానిపై పర్యవేక్షణ చేయాలని సిఎం ఆదేశించారు. ఒకవేళ టీకాలు మిస్సయితే వెంటనే వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఎఎన్‌ఎం అక్కడ ఉండేలా చూడాలని తెలిపారు.

పిల్లలు కూడా వయసుకు తగ్గ బరువు ఉన్నారా లేరా అన్న దానిపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతినెలా బాలింతలు, గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని సిఎం ఆదేశించారు. జీవనశైలిలో మార్పులు కారణంగా వస్తున్న వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వ్యాయామాలపై క్యాంపులు నిర్వహించేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రతినెలా ఒకసారి క్యాంపు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అపారం

- ఏడు జిల్లాల్లో కరువు సమస్య తీవ్రం
- ప్రభుత్వానికి నివేదికలు
- వేరుశనగ, మొక్కజొన్నకు భారీ లాస్
- పత్తి, కంది, మిర్చి కూడా..
- నీరందకుంటే వరి దిగుబడి తగ్గే అవకాశం

వర్షాభావంతో కర్నూలు జిల్లాలో ఎండిపోయిన వేరు శనగ పైరు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో అనావృష్టి కారణంగా పలు జిల్లాల్లో వేసిన పైర్లకు అపార నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి జిల్లాల నుంచి ప్రాథమిక నివేదికలు అందాయి. రాయలసీమలో సాగైన వేరుశనగ చాలా ప్రాంతాల్లో నూటికి నూరు శాతం దెబ్బతింది. పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. రైతులు పంట పెట్టేందుకు పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోవాల్సిందే. సీమ జిల్లాల్లో వేరుశనగ తర్వాత మొక్కజొన్న బాగా దెబ్బతింది. పంట నష్టం 40 నుంచి 70 శాతం పైనే ఉంది. కొన్ని చోట్ల నష్టం వంద శాతం వరకు కనిపిస్తోంది. సీమ, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో పత్తి, కంది, మిర్చి పంటలకు బాగానే నష్టం వాటిల్లింది. పలు జిల్లాల్లో అక్కడక్కడ నీరందక వరి పైరు ఎండిపోతోంది. దిగుబడి నష్టం గణనీయంగా ఉండే అవకాశం ఉంది. ఖరీఫ్ ముగిసిన దరిమిలా ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టం అంచనాలపై వ్యవసాయశాఖ ఎట్టకేలకు దృష్టి సారించింది. జిల్లాల నుంచి దిగుబడి నష్టంపై సమాచారం కోరింది. మీ ప్రాంతంలో ఫలాన పంట సాధారణ దిగుబడి ఎంత, ప్రస్తుతం ఎంత వచ్చే అవకాశం ఉంది అనే వివరాలను పంపాలని ఆదేశించింది. క్షేత్ర స్థాయి అధికారులు, డిఎఒలు రెండు రోజుల నుంచి వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయానికి నివేదికలు పంపుతున్నారు.

ఒకటి రెండు పంటలే

వర్షాభావం, డ్రైస్పెల్స్ మూలంగా పంటల సాగు తగ్గిన ఏడు జిల్లాల నుంచి తొలిదశలో సర్కారు నివేదికలు అడిగినట్లు సమాచారం. కరువు ప్రభావం తీవ్రంగా ఉన్న అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, వైఎస్ఆర్, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం నుంచి నష్టం అంచనాలు కోరారు. సమస్య ఉన్న మరికొన్ని జిల్లాల నుంచి కూడా రిపోర్టులు అడిగారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, నివేదికలు అడిగిన జిల్లాలను వారి వారి ప్రాంతాల్లో అధికంగా సాగు చేసే ఒకటి, రెండు ప్రధాన పంటల వివరాలే పంపమన్నారు. ఏ జిల్లా నుంచి ఏ పంటల సమాచారం పంపాలో ఏ ఫార్మెట్‌లో పంపాలో హెడ్‌ఆఫీస్ నుంచి దిశా నిర్దేశం చేశారు. కరువు మండలాల ప్రకటన కోసం అనే ప్రస్తావన చేయలేదు. కేవలం దిగుబడి నష్టాన్ని మాత్రమే తెలపమన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో వేరుశనగకు ఊడలు కూడా రాలేదని, మొత్తానికే పంట మాడిపోయి నేలపాలైందని జిల్లాల అధికారులు నివేదికలు పంపారు. సాగైన పంట పశువుల మేతకు కూడా పనికిరాకుండా పోయిందని తెలిపారు. చిత్తూరు, వైఎస్ఆర్, కర్నూలు, అన్నమయ్య, నంద్యాల నుంచి కూడా వేరుశనగపై ఇదే విధంగా నివేదించారు. సీమతో పాటు పలు చోట్ల మొక్కజొన్నకు అపార నష్టం వాటిల్లిందని, కంకులు రాని పరిస్థితి ఉందని తెలిపారు. మొక్కజొన్న నష్టం చాలా చోట్ల 40 నుంచి 70 శాతం వరకు ఉందని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో నష్టం వంద శాతం కూడా ఉందని తెలిపారు. ఈ ఖరీఫ్‌లో ఒక్క మొక్కజొన్నే సాధారణ విస్తీర్ణం కంటే కొంచెం ఎక్కువ సాగైంది. వర్షాభావం వలన పంట సాగైందన్న ఆనందం రైతుల్లో ఆవిరైంది. అలాగే సీమ, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో పత్తి, కంది, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. అక్కడక్కడ మిరప పంట 50 శాతానికిపైన చేతికొచ్చే పరిస్థితి లేదు. పలు జిల్లాల్లో నీరందక వరి పైరు ఎండిపోతోంది. ఈ పరిస్థితి ఇంకా కొన్నాళ్లు కొనసాగితే ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.

దిగుబడి దిగదుడుపు

వేరుశనగ ఎకరాకు దిగుబడి కొన్నేళ్లుగా తగ్గుతూ వస్తోంది. ఈ సంవత్సరం 16.10 లక్షల ఎకరాలకు 6.37 లక్షల ఎకరాల్లోనే వేశారు. సగటు దిగుబడి ఎకరాకు రెండున్నర క్వింటాళ్లొస్తాయన్నారు. ప్రస్తుతం అధికారుల అంచనాల్లో అసలేమీ రాదంటున్నారు. పత్తి దిగుబడి నాలుగున్నర క్వింటాళ్లు (కాయలు) వస్తాయని తొలుత చెప్పారు. చాలా చోట్ల అందులో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. మొక్కజొన్న 15 క్వింటాళ్లన్నారు. చాలా చోట్ల అసలు వచ్చే స్థితి కనిపించట్లేదు. కందులదీ అదే పరిస్థితి. వరి ఎకరాకు సగటున 18 క్వింటాళ్లన్నారు. చివరికి ఎంత వస్తుందో తెలీకుండా ఉంది.

కేంద్ర ఉద్యోగులకు 4 శాతం డిఎ

- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ, పెన్షనర్లకు డీఆర్ 4 శాతం, రైల్వే ఉద్యోగులకు బోనస్ చెల్లింపులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర మంత్రి వర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. జులై 1 నుంచి పెరిగిన డీఏ, డీఆర్ వర్తించనుంది. అలాగే రైల్వే ఉద్యోగులకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను 78 రోజులకు సమానమైన వేతనాన్ని బోనస్ చెల్లించనున్నారు. మొత్తం 11,07,346 మంది ఉద్యోగులకు బోనస్ అందనుంది. ఇందుకోసం రూ.1968.87 కోట్లు వెచ్చించనున్నారు.

ఆరు పంటలకు ఎంఎస్‌పి

గోధుమలు అధికంగా పండించే రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా వీటి మద్దతు ధర పెంచాలని కేంద్రం నిర్ణయించింది. 2024-25 రబీ మార్కెటింగ్ సీజన్‌కు గాను క్వింటాల్ కు రూ.150 చొప్పున పెంచి రూ.2,275గా నిర్ణయించినట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ తెలిపింది. కేంద్ర వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సులకు అనుగుణంగా రబీ సీజన్‌కు సంబంధించి ఆరు పంటలకు కనీస మద్దతు ధర పెంచినట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు.

ప్రస్తుతం గోధుమలకు కనీస మద్దతు ధర రూ.2,215 గా ఉంది. అలాగే బార్లీకి క్వింటాకు రూ.115 పెంచి రూ.1,850, శెనగకు క్వింటాకు రూ.105 పెంచి రూ.5,440, కందులకు క్వింటాకు రూ.425 పెంచి రూ.6,425, ఆవాలకు క్వింటాకు రూ.200 పెంచి రూ.5,650, సన్ ఫ్లవర్ క్వింటాకు రూ.150 పెంచి రూ.5,800గా కనీస మద్దతు ధర నిర్ణయించారు.

ఒపిఎస్ అమలు చేస్తేనే ఓటు!

- ఉద్యోగ, ఉపాధ్యాయుల నినాదంగా మారాలి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- ప్రారంభమైన యుటిఎఫ్ నిరవధిక దీక్షలు

విజయవాడలో యుటిఎఫ్ దీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పునరుద్ధరిస్తామన్న పార్టీకే ఓటు వేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఉద్యోగ, ఉపాధ్యాయులను కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దీనినే నినాదంగా తీసుకోవాలని సూచించారు. ఒపిఎస్ అమలుపై రాజకీయ పార్టీలు కూడా తమ వైఖరి ప్రకటించాలని కోరారు. ఒపిఎస్ సాధనకై యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నిరవధిక నిరాహార దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఈ దీక్షా శిబిరాన్ని లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, భిక్ష కాదని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 3.5 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సిపిఎస్ విధానంలో ఉన్నారని చెప్పారు. సిపిఎస్ రద్దు చేస్తానని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టక్కర్ కమిషన్‌ను తీసుకొచ్చి అమలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపు రద్దు చేస్తానన్న ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల తరువాత మాట మార్చారని విమర్శించారు. సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఇందులో కాంట్రిబ్యూషన్ ఉందని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం జరగదని చెప్పారు. పెన్షన్ కొనసాగితే రాష్ట్ర ఖజానా దివాళా తీస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదయోగ్యం లేని వాదనలు చెబుతోందన్నారు. వీటిని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ నుంచి ఒపిఎస్‌లోకి వచ్చాయని తెలిపారు. ఒపిఎస్ అమలు కోసం రాష్ట్ర

మిగతా 2లో

అమరావతి నుంచే రాష్ట్ర పాలన

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- వాస్తవ లబ్ధిదారులకే అసైన్డ్ భూముల పట్టాలివ్వాలి
- ప్రజారక్షణ భేరి యాత్రలను జయప్రదం చేయండి

3

నవంబర్ 22లోగా అభిప్రాయం చెప్పాలి

- 15లోగా తెలంగాణకు కాపీ ఇవ్వండి
- కేంద్ర గెజిట్ నోటిఫికేషన్‌పై ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్

2

ములుగు బహిరంగ సభకు వెళ్తూ దారిలో అభివాదం చేస్తున్న రాహుల్, ప్రియాంక

తెలంగాణలో బిజెపి అడ్రస్ గల్లంతు

- కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో హామీలన్నీ అమలు చేశాం
- వరంగల్‌లో కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రారంభించిన రాహుల్, ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్‌కు ఓటేస్తే బిజెపికి వేసినట్టేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో బిజెపి చిరునామా కోల్పోయిందనీ, ఇక్కడ బిఆర్ఎస్ గెలవాలని బిజెపి కోరుకుంటోందని చెప్పారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం మిలాఖత్ అయ్యాయని తెలిపారు. పార్లమెంట్‌లో బిజెపి ప్రవేశపెట్టిన అన్ని బిల్లులకు బిఆర్ఎస్ మద్దతు

మిగతా 7లో

సదస్సులో మాట్లాడుతున్న శివదాసన్, వేదికపై శ్రీనివాసరావు, దడాల సుబ్బారావు, ఎమ్మెల్సీ సాబ్జీ తదితరులు

ఉపాధిహామీకి నిధుల కోత

- రూ.మూడు లక్షల కోట్లు కేటాయిస్తేనే న్యాయం
- భూ పంపిణీతోనే వ్యవసాయ కార్మికుల అభివృద్ధి
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు, ఎంపి శివదాసన్
- ఉపాధి చట్టంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : వి. శ్రీనివాసరావు

4వ పేజీలో

చంద్రబాబు అరెస్టును కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి

- గవర్నరుతో టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు వెనకున్న రాజకీయ కుట్రల్ని, ఆధారాల్లేని కేసుల్లో జైలుకు పంపిన వైనాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌ను టిడిపి నేతలు కోరారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నరును బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులకు సంబంధించిన పూర్తి వాస్తవాలను గవర్నరుకు అందించామని చెప్పారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సిఐడి, పోలీస్ వ్యవస్థను జేబు సంస్థలుగా మార్చుకుని టిడిపి నేతలు, మీడియా సంస్థలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. అవినీతి జరగని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు రూ.370 కోట్ల అవినీతికి పాల్పడ్డారని జగన్ ప్రభుత్వం ఆరోపణలు చేసి దిగజారి రూ.27 కోట్లకు చెప్పిందని విమర్శించారు. చివరకు ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన సంస్థ, కేంద్ర ప్రభుత్వానికి జిఎస్‌టి చెల్లింపులు చేయనందునే చంద్రబాబుపై కేసు పెట్టినట్లు ప్రభుత్వం వాదిస్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్

మిగతా 7లో

ఇజ్రాయిల్‌కు బైడెన్ వత్తాసు

- గాజా ఆస్పత్రిపై దాడి ప్రత్యర్థుల పనేనంటూకొత్త భాష్యం
- యుద్ధం తంత్రంపై నెతన్యాహుతో మంతనాలు

నెతన్యాహును ఆలింగనం చేసుకుంటున్న బైడెన్

టెల్ అవీవ్ : గాజా ఆసుపత్రిపై అమానుషంగా దాడి చేసి వందలాది మంది అమాయక పాలస్తీనీయులను చంపడం, పాలస్తీనీయులకు నీరు, ఆహారం, విద్యుత్, ఇంధనం అందకుండా చేసి వారిని నరక యాతనకు ఇజ్రాయిల్ గురి చేస్తున్న సమయంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆ దేశ పర్యటనకు బుధవారం విచ్చేశారు. నెతన్యాహుతో మంతనాలు జరిపిన అనంతరం గాజా ఆసుపత్రిపై దాడికి ఇజ్రాయిల్ కారణం కాదంటూ కొత్త బాష్యం చెప్పారు. ఇజ్రాయిల్ పాలస్తీనీయులపై విచక్షణారహితంగా సాగిస్తున్న వైమానిక దాడులను ఆపకుంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో బైడెన్ పరుగు పరుగున టెల్ అవీవ్‌కు వచ్చారు. గాజా ఆసుపత్రిపై ఇజ్రాయిల్ దాడిని అరబ్ దేశాలతో సహా చాలా దేశాలు ఖండించగా, అమెరికా అధ్యక్షుడు విచారం వ్యక్తం చేయడంతో సరిపెట్టారు. గట్టి బందోబస్తు ఏర్పాట్ల మధ్య విమానం దిగిన వెంటనే బైడెన్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌లను ఆలింగనం చేసుకున్నారు. గాజాలోని ఆస్పత్రిపై దాడి ఇజ్రాయిల్ చేసినట్టు లేదు, ఎవరో బయటివారే దీనికి పాల్పడి ఉంటారంటూ ఇజ్రాయిల్‌కు బైడెన్ నిస్సిగ్గుగా వత్తాసు పలికారు. ప్రధాని నెతన్యాహుతో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్న ఆయన గాజా ఆస్పత్రిపై దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఆస్పత్రిపై దాడికి ఇజ్రాయిల్ కారణం కాదంటూ నెతన్యాహు చెప్పినదానిని అమెరికా నమ్ముతోందని చెప్పారు. అమెరికా దన్ను చూసుకుని నెతన్యాహు మరింతగా బరితెగించారు. ఇజ్రాయిల్ దాష్టీకాలు, ఆక్రమణ గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడని బైడెన్ హమాస్‌పై తన అక్కసునంతా వెళ్లగక్కారు. ఇది పాలస్తీనా ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించదని, కేవలం వారికి కష్టాలు, నష్టాలు మాత్రమే కొనితెస్తోందని అన్నారు. ఏది సరైన చర్య అని భావిస్తే ఆ చర్యలు చేపట్టడానికి ఇజ్రాయిల్‌కు బైడెన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని అల్ జజీరా వార్తా సంస్థ వ్యాఖ్యానించింది. గాజా ఆసుపత్రిపై దాడి నేపథ్యంలో బైడెన్‌తో ముందుగా నిర్ణయించిన సమావేశాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఈజిప్టు, జోర్డాన్, పాలస్తీనా అథారిటీ ప్రకటించాయి.

పెను విపత్తుగా మారకముందే మేల్కోవాలి: పుతిన్

బీజింగ్ : గాజా ఆస్పత్రిపై దాడి పెను విపత్తుగా మారకముందే అంతర్జాతీయ సమాజం మేల్కోవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ పిలుపునిచ్చారు. తక్షణమే చర్చల ద్వారా ఈ ఘర్షణలకు స్వస్తి పలకాలని ఆయన సూచించారు. ఆసుపత్రిపై జరిగిన దాడిని భయంకరమైన ఘటనగా ఆయన అభివర్ణించారు.. బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చల అనంతరం పుతిన్ మాట్లాడారు. వందలాది మంది మరణించారు, వందలాదిమంది గాయపడ్డారు, అంటే ఇదొక మహా విపత్తే అని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరలో ఈ ఘర్షణలను ముగించాల్సిన అవసరం వుందని ఈ ఘటన తెలియచేస్తోందన్నారు. కాబట్టి వెంటనే చర్చలపై మనం దృష్టి పెట్టాల్సి వుందన్నారు. 1967 నాటి సరిహద్దులతో స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడాల్సిన అవసరాన్ని అమెరికా, పశ్చిమ దేశాలు విస్మరించాయని రష్యా పదే పదే విమర్శిస్తూ వస్తోంది. ఈ దాడి గురించి తెలిసిన వెంటనే ఇరాన్, సిరియా, ఈజిప్ట్, పాలస్తీనా, ఇజ్రాయిల్ నేతలతో పుతిన్ మాట్లాడారు. చైనా నేత జిన్‌పింగ్‌తో కూడా దీనిపై చర్చించినట్లు తెలిపారు. ఎవరూ కూడా ఈ ఘర్షణలు పెచ్చరిల్లాలని కోరుకోవడం లేదన్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దసరా పండగ సందర్భంగా ప్రత్యే రైళ్లు నడపనున్నట్లుగా దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 20న రైలు నెంబరు 07061 నాందేడ్ నుంచి కాకినాడ టౌన్ వరకు నడపనుంది. నాందేడ్ నుంచి సాయంత్రం 4:30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:45 గంటలకు కాకినాడ టౌన్‌కు ఆ రైలు చేరుకోనుంది. అదే విధంగా ఈ నెల 24న రైలు నెంబరు 07165 హైదరాబాద్ నుంచి కటక్‌కు సాయంత్రం 8:10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5:45 గంటలకు కటక్ చేరుకోనుంది. రైలు నెంబరు 07166 ఈ నెల 25న కటక్ నుంచి రాత్రి 10:30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనుంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చంద్రబాబు ముందస్తు బెయిల్ కేసు 7కు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు చేసి లబ్ధిపొందేలా చేశారనే కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ నవంబరు 7కు వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ కె సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్ పిటిషనర్‌కు వర్తిస్తుందని పేర్కొంటూ వేసిన ఎస్‌ఎల్‌పి సుప్రీంకోర్టు విచారించి తీర్పును రిజర్వులో పెట్టిందని, ఈ కేసులో సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు వస్తే బెయిల్ పిటిషన్‌పై విచారణే అవసరం ఉండదని చెప్పారు. దసరా సెలవుల తర్వాత తమ పిటిషన్‌పై విచారణ చేయాలని కోరగా అందుకు హైకోర్టు అనుమతినిచ్చింది.

టిడిపి నేత అప్పారావు బెయిల్ రద్దుకు సుప్రీం నో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

టిడిపి నేత ఆదిరెడ్డి అప్పారావుకు బెయిల్ రద్దు చేయడానికి సుప్రీం నిరాకరించింది. జగత్ జనని చిట్ ఫండ్ కంపెనీలో అక్రమాలు ఆరోపణలతో ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు ఆదిరెడ్డి వాసును సిఐడి అరెస్టు చేసింది. అయితే ఈ ఇద్దరికీ ఎపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో హైకోర్టు తీర్పును సిఐడి సుప్రీంలో సవాలు చేసింది. బుధవారం నాడు ఈ పిటిషన్ సుప్రీంలో విచారణకు రాగా.. సిఐడి తరపున న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆదిరెడ్డి అప్పారావు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. విచారణకు సహకరించాలని ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీం సూచించింది. విచారణకు సహకరిస్తారని సుప్రీంకు సిద్ధార్థ లూథ్రా హామీ ఇచ్చారు. దీంతో ఆదిరెడ్డి అప్పారావు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

రామోజీ, శైలజపై తదుపరి చర్యలు నిలిపివేత

- 8 వారాలు అమల్లో ఉండేలా హైకోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ హోల్డర్ వివాదంపై సిఐడి నమోదు చేసిన కేసులో ఆ సంస్థ వ్యవస్థాపకులు చెరుకూరి రామోజీరావు, ఎమ్‌డి శైలజా కిరణ్‌పై ఎనిమిది వారాలపాటు కఠిన చర్యలు తీసుకోరాదని సిఐడికి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సిఐడి తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ జస్టిస్ బివిఎల్‌ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిఐడి కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు ఇచ్చారు. మార్గదర్శి సహ వ్యవస్థాపకులు అయిన తన తండ్రి గాదిరెడ్డి జగన్నాథరెడ్డి (జిజె రెడ్డి)కి మార్గదర్శి చిట్‌ఫండ్‌లో ఉన్న వాటాల కోసం వెళితే రామోజీరావు తనను తుపాకితో బెదిరించారని, తమ వాటాలను ఆయన కోడలు శైలజ పేరిట అక్రమంగా బదలాయించారని జగన్నాథరెడ్డి కొడుకు గాదిరెడ్డి యూరి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి ఈ నెల 13న కేసు నమోదు చేసింది. దీనిని కొట్టేయాలని, తుది తీర్పు వెలువరించేలోగా సిఐడి దర్యాప్తుపై స్టే ఇవ్వాలని రామోజీ, శైలజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి విచారణను డిసెంబరు 6కు హైకోర్టు వాయిదా వేసింది.

ఉపాధిహామీకి నిధుల కోత

- రూ.మూడు లక్షల కోట్లు కేటాయిస్తేనే న్యాయం
- భూ పంపిణీతోనే వ్యవసాయ కార్మికుల అభివృద్ధి
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు, ఎంపి శివదాసన్
- ఉపాధి చట్టంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : వి. శ్రీనివాసరావు

సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి హామీకి ప్రతియేటా మోడీ సర్కార్ నిధుల కోత విధిస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పూనుకుందని, దీన్ని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని, ప్రతియేటా బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.మూడు లక్షల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ నాయకులు, ఎంపి శివదాసన్ అన్నారు. ఉపాధి హామీ పనిదినాలు, వేతనాల పెంపుతో పాటు పట్టణాలకు ఈ చట్టాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరులోని కాశీవిశ్వేశ్వరయ్య కల్యాణ మండపంలో బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శివదాసన్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని పేదలకు పని కల్పించేందుకు వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందన్నారు. మోడీ పాలనలో ఈ చట్టానికి నిధుల్లో కోత విధిస్తోందని తెలిపారు. గడిచిన బడ్జెట్లో రూ.28 వేల కోట్లు కోత విధించారని, దీనికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని కోరారు. కేరళలో ఉపాధి కూలీలకు రూ.332 కూలి ఇస్తుంటే ఎపి, తెలంగాణలో రూ.272 ఇస్తున్నారని తెలిపారు. ఒకే సివిల్ కోడ్, వన్ ఆధార్, వన్ రేషన్, ఒకే భాష అంటున్న మోడీ సర్కార్ దేశమంతా ఒకే కూలి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉపాధి పనికి 30 రోజులు వెళ్లినా రూ.ఏడు వేలు కూడా రావడం లేదన్నారు. పిల్లల చదువులకు ఏడాదికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని, అటువంటప్పుడు వ్యవసాయ కార్మికులు తమ పిల్లలను ఏ విధంగా చదివించుకోగలరని ప్రశ్నించారు. 1957లోనే కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వం భూ పంపిణీ చేపట్టిందన్నారు. భూమి ఉంటేనే పేదలు అభివృద్ధి చెందుతారని, బిజెపి ఆ విధంగా చేయడం లేదని అన్నారు.

భూమి కోసం ఇళ్లస్థలాల కోసం వ్యవసాయ కార్మికులు పోరాటం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా రూ.20 కోట్ల మందికి జాబ్‌కార్డులున్నాయని, వీరి పిల్లలకు విద్య, వైద్యం అందుబాటులో లేదని, వ్యవసాయ కార్మికులకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. జగన్ జైలుకు వెళ్లొచ్చారని, చంద్రబాబు జైల్లో ఉన్నారని, ఇక్కడ ప్రజాధనం లూటీ జరుగుతుందని అన్నారు. వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదని, కేరళ బడ్జెట్‌లోనే వ్యవసాయ కార్మికుల పెన్షన్లకు నిధులు కేటాయించారన్నారు. భవిష్యత్తులో ఆశాజనకమైన రోజులు రాబోతున్నాయని, అంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని కోరారు. బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.మూడు లక్షల కోట్లు కేటాయించాలని, ఏడాదికి ఒక కుటుంబానికి 200 పనిదినాలు, రూ.600 వేతనం ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో ఈ చట్టాన్ని అమలు చేయాలంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తీర్మానం ప్రవేశపెట్టగా దాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం బలపరిచారు. ఈ తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఉపాధిపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : శ్రీనివాసరావు

త్వరలో ఎన్నికలు జరగనున్నాయని, అయితే ప్రజా సమస్యలపై కాకుండా ఇతర విషయాలపై చర్చలు జరుగుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. 2006లో ఉపాధి చట్టాన్ని సాధించుకున్నామని, ఈ చట్టం ప్రకారం పనిచేసే హక్కు అందరికీ ఇవ్వాలన్నారు. తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వ సంస్థలను అమ్మేసిన పరిస్థితి ఉందని, అదేవిధంగా ఉపాధి చట్టంపై దుష్ప్రచారం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టం దెబ్బతింటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఈ చట్టాన్ని ఎవ్వరూ మార్చకుండా షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలూ మద్దతివ్వాలన్నారు. ఎన్నికల్లో ఇదే ఎజెండాగా కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, వి.శివనాగరాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, న్యూడెమోక్రసీ నాయకులు పోరండ్ల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య నివేదికలు ఎందుకు ఇవ్వరూ?

- చంద్రబాబుతో ములాఖత్ అయిన కుటుంబసభ్యులు, మాజీ మంత్రులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

చంద్రబాబు వైద్య నివేదికలు ఇవ్వకపోవడానికి కారణం ఏమిటి?, తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలతో 40 రోజులుగా చంద్రబాబును జైల్లో పెట్టారని మాజీ మంత్రులు కిమిడి కళావెంకట్రావు, కొల్లు రవీంద్ర అన్నారు. రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబుతో బుధవారం నారా లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కళావెంకట్రావు, కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై మాకు ఆందోళనగా ఉంది. చంద్రబాబుకు చేసే వైద్య పరీక్షలు, డాక్టర్లు ఏం సలహాలు ఇచ్చారో లిఖిత పూర్వకంగా ఇవ్వాలని అధికారులకు భువనేశ్వరి లేఖ రాశారు. చంద్రబాబు వైద్య నివేదికను వ్యక్తిగత డాక్టర్లకు పంపిస్తే పాత మందులకు మార్పులు, చేర్పులు చేస్తే గానీ పరిస్థితి మారుతుందేమో చూడాలి. కేసును ఏదో విధంగా ఆలస్యం చేసి చంద్రబాబును జైల్లో పెట్టాలని చూస్తున్నారు. 40 రోజులుగా ఒక్క ఆధారం కూడా కోర్టుకు చూపించలేదు. డాక్టర్ల నివేదకను వెంటనే కుటుంబ సభ్యులకు ఇవ్వాలి' అని కోరారు

టిడిపి నాయకులతో మాట్లాడుతున్న లోకేష్

లోకేష్‌ను కలిసిన ఆదిరెడ్డి, కింజరాపు

ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆర్‌వి.నగర్‌లోని ఆయన క్యాంపు సైట్ వద్ద టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు కలిశారు.

సిపిఎం మాజీ సర్పంచ్ నరసింహారావు మృతి

ప్రజాశక్తి - పామర్రు

కృష్ణాజిల్లా పామర్రు మండలం కురుమద్దాలి గ్రామ పంచాయతీ సిపిఎం మాజీ సర్పంచ్ గుళ్లపల్లి నరసింహారావు (95) బుధవారం తుదిశ్వాస విడిచారు. వయోభారంతో గత కొంతకాలంగా ఆయన బాధపడుతున్నారు. 21 సంవత్సరాలపాటు కురు మద్దాలి గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. జైలు జీవితం కూడా అనుభవించారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గతంలోనే మరణించారు. కుమారుడు జీవిరావు హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌లో ప్రధాన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు కురుమద్దాలిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

నవంబర్ 22లోగా అభిప్రాయం చెప్పాలి

- 15లోగా తెలంగాణకు కాపీ ఇవ్వండి
- కేంద్ర గెజిట్ నోటిఫికేషన్ పై రాష్ట్ర ప్రభుత్వానికి బ్రిజేష్ ట్రిబ్యునల్ ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ పై నవంబర్ 22లోగా అభిప్రాయం చెప్పాలని, నవంబర్ 15లోగా తెలంగాణాకు కాపీ అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ ఆదేశించింది. ఏపి అభిప్రాయాలపై స్టేట్‌మెంట్‌ను ఫైల్ చేయడానికి తెలంగాణకు అనుమతించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ వివాదంపై జస్టిస్ బ్రిజేష్ కుమార్ (ఛైర్మన్), జస్టిస్ రామ్ మోహన్ రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర(సభ్యులు)లతో కూడిన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ బుధవారం విచారణ ప్రారంభించింది. 2023 అక్టోబర్ 6న కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ చేసిన ప్రొసీడింగ్‌లను 2023 అక్టోబర్ 18 నుండి 20కి రెండు వారాల పాటు వాయిదా వేయడానికి ఐఎ దాఖలు చేసింది. కానీ ట్రిబ్యునల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని, అందుకు అవకాశం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్ ను కోరింది. అయితే, ఏపీ అభ్యర్థనను తెలంగాణ ప్రభుత్వం తోసిపుచ్చింది. నీటి పంపకాలపై వెంటనే విచారణ చేపట్టాలని ట్రిబ్యునల్ ను తెలంగాణ కోరింది. అయితే ఏపి ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు విచారణను వాయిదా వేసింది.

రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలకు సంబంధించిన విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన ఆదేశాలు ఇవ్వాలని అక్టోబర్ 6న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణా నదీ జలాల పంపకాలపై విచారణ అధికారాలను కేంద్రం నోటిఫై చేసింది. ఆంధ్రప్రదేశ్ తరపు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ "గెజిట్ నోటిఫికేషన్ ప్రస్తుత రిఫరెన్స్ పరిధిని విస్తరింపజేసే ప్రస్తుత టీఓఆర్‌లను సవరించింది. ఇంకా, గోదావరి నీటి మళ్లింపు కొత్త టిఓఆర్‌లో చేర్చారు. దీన్ని గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ చేస్తుంది. .కృష్ణా ట్రిబ్యునల్ కాదు. రెండో అపెక్స్ కౌన్సిల్ మినిట్స్‌పై ఏపి ఆధారపడి ఉంది" అని పేర్కొన్నారు. కొత్త గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం తీర్పును కొనసాగించవద్దని అభ్యర్థించారు. దీనికి సమాధానంగా తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ సెక్షన్-89 ప్రొసీడింగ్స్ ప్రకారం షెడ్యూల్ చేయబడిన తుది వాదనలను కొనసాగించడం సరికాదని వాదించారు. తాము చాలా కాలం పాటు వేచి ఉన్నామని, చాలా కష్టంతో తాము ఈ కొత్త గెజిట్ ను పొందగలిగామని తెలిపారు. 811 టీఎంసీల పంపిణీలో జాప్యం, అడాక్ షేరింగ్ ఏర్పాట్లను కొనసాగించాలనే ఉద్దేశ్యంతో, ట్రిబ్యునల్‌కు సూచించిన గోదావరి టీఓఆర్‌పై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న ట్రిబ్యునల్ నవంబర్ 22, 23ల్లో విచారణకు వాయిదా వేసింది.

దొంగ ఓట్లను తొలగించండి

- ఎన్నికల సంఘం సిఇఒకు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి హయాంలో అక్రమంగా నమోదుచేసిన దొంగ ఓట్లన్నిటిపై విచారణ జరిపి తొలగించాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ తరపున మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, ఆళ్ల నాని, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ తదితరులు ఎన్నికల సంఘం సిఇఒ ముఖేష్‌కుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో 60 లక్షల దొంగ ఓట్లను చేర్పించారని ఆరోపించారు. అనర్హుల ఓట్లపై విచారణ జరిపి తొలగించాలని కోరామన్నారు. ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓట్లను నమోదు చేయించారని వివరించారు. ఇప్పటికే ఈ అనర్హత ఓట్లను బిఎల్‌ఒలు గుర్తించారని, వాటిని ఇంకా తొలగించలేదని వారు మీడియాకు వివరించారు. చనిపోయిన ఓటర్లను కూడా తొలగించాలని కోరామని వెల్లడించారు. పక్క రాష్ట్రాల్లోనూ, ఇక్కడ రెండు చోట్లా ఓట్లు ఉండటం సమంజసం కాదని అన్నారు. అందుకే ఆ ఓట్లను వడకట్టి ఏదో ఒకచోట ఓటు వుండేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

ఒపిఎస్ అమలు చేస్తేనే ఓటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై పెద్దస్థాయిలో ఒత్తిడి తేవాలని కోరారు.

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదన్నారు. ఉద్యోగులకు ఒపిఎస్ లాభమని తాము రాష్ట్ర ప్రభుత్వానికి గణాంకాలతో వివరించామని, అయినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఒపిఎస్ అమలు చేసేంత వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఒపిఎస్ అమలు చేస్తామన్న పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓట్లు వేస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ విధానంలో కాకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలోనే ఉద్యోగాలను భర్తీ చేస్తోందన్నారు. భవిష్యత్తులో రెగ్యులర్ ఉద్యోగాలు ప్రభుత్వం ఇచ్చినా పెన్షన్ ఉండదన్నారు. పాత పెన్షన్ కోసం తాము చేసే ఉద్యమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని, పెన్షన్ అమలు చేసే పార్టీకే ఓటు వేయాలని కోరారు. గురువారం జిల్లా కేంద్రాల్లో, శుక్రవారం పాత తాలూకా కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. పాత పెన్షన్ సాధించే వరకు కొనసాగుతాయని చెప్పారు. ఎపిసిపిఎస్ఇఎ అధ్యక్షులు అప్పలరాజు దీక్షలకు సంఘీభావంగా మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలకు తాము బలయ్యామని, రాష్ట్ర ప్రభుత్వం తమను మోసం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిపిఎస్ పేరుతో మోసపూరిత విధానాన్ని తీసుకొచ్చి తమపై రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిపిఎస్‌లో ఏయే అంశాలు ఉన్నాయో ఒక్కసారి కూడా సంఘాలతో చర్చించలేదని, దొంగచాటుగా బిల్లు తెచ్చిందని ఆగ్రహించారు. జిపిఎస్ పేరుతో ఉన్న సమస్యను ప్రభుత్వం మరింత జఠిలం చేసిందన్నారు. దీక్షలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, కోశాధికారి బి గోపీమూర్తి, కార్యదర్శులు ఎన్ మనోహర్‌కుమార్, వి కోటేశ్వరప్ప, ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్ కుమార్ రాజా, ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్‌ఎల్‌ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం హనుమంతరావు ఉన్నారు. దీక్ష ప్రారంభానికి ముందు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, దాచూరి రామిరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ దీక్షలకు మద్దతు ప్రకటించారు.

దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

యుటిఎఫ్ నిరవధిక నిరాహార దీక్షలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పూర్తి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావుతో కలిసి సందర్శించారు. 2004లో పెన్షన్ విధానం రద్దు చేసినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో నాలుగైదు ఏళ్ల నుంచి ఉద్యమం సమరశీలంగా నడుస్తుందని, ఈ పోరాటానికి సిపిఎం మద్దతు ఎప్పుడూ ఉంటుందని శ్రీనివాసరావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పోరాటాన్ని అణచివేయాలని చూస్తుందన్నారు. ఈ దీక్షలు ఇతర సంఘాలు, రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హామీలు నెరవేర్చినట్లు నెరవేరుస్తారని ప్రభుత్వ ఉద్యోగులు నమ్మారని అన్నారు. ఇప్పుడు తెలియక వాగ్దానం చేశానని మోసపూరిత ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఉద్యోగుల పట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దుకు చేస్తున్న పోరాటం న్యాయమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ఈ ఆందోళనలకు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలన్నారు. సిపిఎస్ రద్దుపై అన్ని రాజకీయ పార్టీలూ తమ వైఖరి ప్రకటించాలని కోరారు.

'రాజకీయ పార్టీలు మౌనం వీడాలి'

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు మౌనం వీడాలని, త్యాగాలు, బలిదానాలతో ఏర్పడిన ప్లాంట్‌ను రక్షించుకునేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 979వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలనే చిత్తశుద్ధి రాజకీయ నాయకులకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారం పట్ల స్పందించకపోవడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. విభజన హామీలను తుంగలో తొక్కినా... బిజెపి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతికేలా రాష్ట్ర రాజకీయాలను దిగజార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జనార్ధన్, మరిడయ్య, బి.జగదీష్, సిహెచ్.రామరాజు, కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తప్పుకు పంచాయతీలను శిక్షించొద్దు

- కేంద్రం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం పంచాయతీలకు కేటాయిస్తోన్న ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించిన పాపం రాష్ట్ర ప్రభుత్వానిదని, దీనికి పంచాయతీలను శిక్షించడం అన్యాయమని, తక్షణం నిధులు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎక్కువ పంచాయతీల్లో ఏకంగా 80 నుంచి 90 శాతం నిధులను విద్యుత్ ఛార్జీల బకాయిల పేరుతో జగన్ ప్రభుత్వం జమ చేసుకుందని తెలిపారు. దీనిపై వివరణ ఇచ్చే వరకు తదుపరి నిధులు విడుదల చేయబోమని కేంద్ర ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక గ్రామ పంచాయతీల్లో వర్షాకాలం సమయంలో బ్లీచింగ్ కొట్టించలేకపోతున్నాయని, కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామ పంచాయతీలో గ్రీన్‌గార్డ్, గ్రీన్ అంబాసిడర్ పేరుతో తీసుకున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వమే జీతాలు ఇస్తామని చెప్పి, ఒక సంవత్సరం మాత్రమే ఇచ్చి బాధ్యతారాహిత్యంగా చేతులు దులుపుకుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కార్మికులకు ప్రతినెలా వారే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం (రెండవ క్వార్టర్) నిధులను కేంద్ర ప్రభుత్వం మూడు నెలలు క్రితమే విడుదల చేయాల్సి ఉందని, ఇప్పటికైనా వెంటనే నిధులు విడుదల చేసి గ్రామ పంచాయతీలకు జమ చేయాలని కోరారు.

చంద్రబాబును అవమానిస్తున్న కుటుంబ సభ్యులు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు ఆరోగ్యం పట్ల జైళ్లశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా ఆయన కుటుంబ సభ్యులు వివాదం చేస్తూ గోప్యంగా వుండాల్సిన ఆరోగ్య సమస్యలను బహిర్గతం చేసి అవమానాలకు గురిచేస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. నిబంధనల మేరకు చంద్రబాబు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా, రోజూ ఏదోఒక వివాదం చేయడం తగదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దోమలు వున్నాయని, ఉక్కపోత వుందని, అలెర్జీలు పెరిగాయని ఇలా ప్రతి అంశంలో టిడిపి నాయకులు, కుటుంబ సభ్యులు వివాదం చేస్తూనే వున్నారని అన్నారు. చంద్రబాబుకు అవసరమైనప్పుడల్లా బయట నుంచి స్పెషలిస్టులను పిలిపించి వైద్యం చేస్తున్నారని అన్నారు. న్యాయవాదుల ములాఖత్‌లను రోజుకు రెండుసార్లు ఇస్తే సమస్యలు వస్తాయని, ఒకసారికి మారిస్తే దాన్ని కూడా వివాదం చేయడం తగదని అన్నారు. న్యాయవాదులు ఒకసారి మాట్లాడితే సరిపోదా? అని ప్రశ్నించారు. అలాగే మార్గదర్శి విషయంలోనూ రామోజీరావు తీరు అన్యాయంగా వుందని అన్నారు. రామోజీరావు ఎదుగుదలకు కారణమైన జిజె రెడ్డి కుటుంబాన్ని తుపాకితో బెదిరించి వాటాలను రాయించుకున్నారని విమర్శించారు. రామోజీరావు బెదిరింపుల పర్వం ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చిందన్నారు.

15 నుంచి సమగ్ర కులగణన

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సమగ్ర కులగణనకు వచ్చే నెల 15 నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనగణనతో పాటు సమగ్ర కులగణనను కూడా రాష్ట్రంలో జరిపించాలని గత బడ్జెట్ సమావేశాల్లో శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామన్నారు. కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాకున్నా, రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు అనుగుణంగా రాష్ట్రంలో కులగణన చేయించాలని గత శాసనసభా సమావేశాల్లో తీర్మానించామన్నారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన అధ్యయన కమిటీ నేతృత్వంలో గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల సహకారంతో రాష్ట్రంలో కులగణనను వచ్చే నెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకించి ఒక యాప్‌ను కూడా రూపొందించామన్నారు. ఈ కులగణనకు గానూ బిసి నాయకులు, కులపెద్దల నుంచి సూచనలు, సలహాలు సేకరించేందుకు విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో ప్రాంతాల వారీ రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఒక ఇ-మెయిల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు వైఎస్ఆర్ అవార్డుల ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు జాబితాను గురువారం ప్రకటించనున్నట్లు సమాచారశాఖ కమిషనరు తుమ్మా విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వరుసగా మూడో ఏడాది అందించనున్న ఆ అవార్డుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వ కమ్యూనికేషన్స్ సలహాదారు జివిడి కృష్ణమోహన్ ప్రకటిస్తారని తెలిపారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు కింద గ్రహీతలకు రూ.10 లక్షల నగదు పురస్కారంతోపాటు వైఎస్ఆర్ కాంస్య ప్రతిమ, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.5 లక్షల నగదు పురస్కారంతోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఇస్తామని వివరించారు. నవంబరు ఒకటో తేదీన అవార్డులు ఇస్తారని తెలిపారు.

ఫైబర్‌నెట్ కేసులో వారెంట్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- కాల్‌డేటా పిటిషన్‌ను సవరించి తీసుకురావాలని ఎసిబి కోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఫైబర్‌నెట్ కేసులో సిఐడి దాఖలు చేసిన పిటి వారెంట్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 20కు ఎసిబి కోర్టు వాయిదా వేసింది. సిఐడి వేసిన పిటి వారెంట్‌పై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును బుధవారం ఎసిబి కోర్టులో వ్యక్తిగతంగా ప్రవేశపెట్టాల్సి వుంది. ఇదే కేసులో సుప్రీంకోర్టులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన నేపథ్యంలో సిఐడి దాఖలు చేసిన మెమోకు అనుగుణంగా పిటి వారెంట్‌పై విచారణ నిర్ణయాన్ని ఈ నెల 20కు ఎసిబి కోర్టు వాయిదా వేసింది.

కాల్‌డేటా పిటిషన్‌ను సవరించి దాఖలు చేయండి

చంద్రబాబు అరెస్టుకు ముందు ఆ తర్వాత రాష్ట్ర సిఐడి అధికారుల కాల్‌డేటా రికార్డును ఇవ్వాలని చంద్రబాబు తరుపున న్యాయవాదులు వేసిన పిటిషన్‌పై బుధవారం ఎసిబి కోర్టు విచారణ చేపట్టింది. పిటిషన్‌ను సవరించి దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులకు ఎసిబి కోర్టు సూచించింది. లీగల్ ప్రొవిజన్ ప్రకారం పిటిషన్‌లోని అంశాల్ని ప్రస్తావించాలని సూచించింది. ఫైబర్‌నెట్ కేసులో పిటి వారెంట్, చంద్రబాబు హెల్త్ రిపోర్ట్, సిఐడి అధికారుల కాల్ డేటా రికార్డు ఈ మూడు కేసులను ఈ నెల 20కు ఎసిబి కోర్టు వాయిదా వేసింది.

'కడప ఉక్కు' స్థలాన్ని పరిశీలించిన జపాన్ బృందం

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కు పరిశ్రమ స్థలాన్ని జెఎస్‌డబ్ల్యు, జపాన్ బృందం బుధవారం పరిశీలించింది. మొదటిసారి శంకుస్థాపన చేసిన విషయాన్ని, రెండవసారి జెఎస్‌డబ్ల్యు వారిచే ఈ ఏడాది ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసిన విషయానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. జెఎస్‌డబ్ల్యుకు కేటాయించిన స్థలాన్ని, ఇక్కడి పరిస్థితుల గురించి వైఎస్‌ఆర్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ బి.బలరాం, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.రామలింగేశ్వర, సైట్ మేనేజర్ కె.శాంతి స్వరూప్, డిఇఇ ఎస్.విజయకాంత్‌రెడ్డి వివరించినట్లు సమాచారం. స్థలాన్ని పరిశీలించిన బృందంలో జెఎస్‌డబ్ల్యు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, డైరెక్టర్ కనకారావు, డిజిఎం వికాస్ కుమార్‌లతోపాటు జపాన్‌కు చెందిన మునియోసో నకాటాని యమాటో కోజియో, తోసియుకి యోకోయమ, స్థానిక వైసిపి రాష్ట్ర నాయకులు మల్‌రెడ్డి హనుమంత్‌రెడ్డి ఉన్నారు.

కార్మిక వ్యతిరేకి బిజెపి

- సిపిఎం ఎంపి వి.శివదాసన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను కేంద్రం దుందుడుకుగా అవలంభిస్తోందని సిపిఎం ఎంపి శివదాసన్ (కేరళ) ఆందోళన వ్యక్తం చేశారు. 'పాలకుల విధానాలు- ప్రత్యామ్నాయ రాజకీయాలు' అనే అంశంపై బుధవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని కిరాణా వర్తక సంఘ భవనంలో సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. శివదాసన్ మాట్లాడుతూ.. దేశంలో పెట్టుబడిదారులకు, బడా కార్పొరేట్లకు కేంద్రం రూ.14 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగు జాడల్లో వైసిపి ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీ విధానాలను వ్యతిరేకించి ప్రజా పోరాటాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువులు, ఎరువుల ధరలు, ప్రజల ఔషధాల ధరలను పెంచి, జిఎస్‌టి తీసుకొచ్చి ప్రజలపై మోయలేని భారాలను మోపారన్నారు. బిజెపి పాలనను ప్రజలు తరిమికొట్టాలని కోరారు. సదస్సులో సిపిఎం జిలా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు.

అమరావతి నుంచే రాష్ట్ర పాలన

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- వాస్తవ లబ్ధిదారులకే అసైన్డ్ భూముల పట్టాలివ్వాలి
- ప్రజారక్షణ భేరి యాత్రలను జయప్రదం చేయండి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్

విశాఖపట్నానికి మకాం మారుస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని, అమరావతి నుంచే రాష్ట్ర పరిపాలన సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులోని ఉద్దరాజు రామం భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రాజధానుల చట్టాన్ని ఉపసంహరించుకున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వమే అసెంబ్లీలో ప్రకటించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి క్యాంపు ఆఫీస్ ఎక్కడైనా ఉండొచ్చని, అయితే అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను విశాఖపట్నం మారుస్తానంటే ప్రజలు హర్షించరని, ఇది అస్థిరత్వ పాలనకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరించడానికి ఇది రాచరికం కాదని, ప్రజాస్వామ్యమని గుర్తు చేశారు. అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని, అమ్ముకునే హక్కులు కల్పిస్తామని చెప్పడం ద్వారా వాస్తవ అసైన్డ్ లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. మహిళల పేరుతో అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని కోరారు. కృష్ణా డెల్టా పరిధిలో ఏలూరు, బాపట్ల, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని కోరారు. చంద్రబాబుతో ములాఖత్ విషయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. మాజీ మంత్రులను, మాజీ ఎమ్మెల్యేలను అరెస్టులు చేయడం తగదన్నారు. ఇతర పార్టీలు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమాలపైన నిర్బంధం ప్రయోగిస్తున్న సందర్భాల్లో టిడిపి మౌనంగా ఉంటుందని, ఇతరులపై నిర్బంధాన్ని కూడా టిడిపి ప్రశ్నించాలని కోరారు. మద్యంపై 24 గంటల్లో కేంద్రం చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి వినతిపత్రం ఇచ్చారని, మూడు రోజులు గడుస్తున్నా కేంద్రం ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలన్నారు. బిజెపి చెబుతున్న మద్యం కుంభకోణంపై సిబిఐ దర్యాప్తునకు కేంద్రం ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని బలపరుస్తూ ఎన్‌డిఎలో జనసేన ఏ విధంగా భాగస్వామ్యం అవుతుందో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

30 నుండి సిపిఎం ప్రజారక్షణభేరి యాత్రలు

వివిధ తరగతులు, వర్గాల ప్రజల సమస్యలపై రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోరుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రాష్ట్ర సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 30 నుంచి పార్వతీపురం, శ్రీకాకుళం, కర్నూలు నుంచి రాష్ట్ర బస్సు యాత్రలు నిర్వహిస్తున్నామని, ఈ యాత్రలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 12 రోజులపాటు పర్యటిస్తాయని చెప్పారు. నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని చెప్పారు. ప్రజారక్షణ భేరి యాత్రలను, విజయవాడ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంతాప సభలో మాట్లాడుతున్న తులసీదాస్

చిరస్మరణీయులు సత్యం మాస్టారు

ప్రజాశక్తి - మందస

జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన కొల్లి సత్యనారాయణ (సత్యం మాస్టారు) చిరస్మరణీయులు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా మందసలో సత్యం మాస్టారు సంతాప సభను బుధవారం నిర్వహించారు. ముందుగా సత్యం మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యం మాస్టారు ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన ఆయన వ్యవసాయ శాఖ ఉద్యోగిగా శ్రీకాకుళం జిల్లాలోని మందసకు వచ్చారని తెలిపారు. తర్వాత పలాస మండలం బొడ్డపాడు స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా చేరారని చెప్పారు. ఆ సమయంలోనే ఉద్దానం ప్రాంతంలో సాగుతున్న శ్రీకాకుళం గిరిజనోద్యమం వైపు అడుగులు వేశారని తెలిపారు. ఉద్యోగం కోల్పోవడంతో పాటు 1968 నుంచి 1974 వరకు జైలులో నిర్బంధించబడ్డారని చెప్పారు. ఎమర్జెన్సీ కాలంలో 19 నెలలు మళ్లీ ఆయనను జైలులో ఉంచారన్నారు. జైలు నుంచి వచ్చిన తర్వాత సిపిఎంలో చేరారని, మందస ప్రాంతంలో పార్టీ, ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి తనవంతు కృషి చేశారని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యునిగా, కార్యదర్శివర్గ సభ్యునిగా సోంపేటలో తనకున్న పరిచయాలతో మందస, బారువ, బూరగాం, మామిడిపల్లి ప్రాంతాల్లో జనాలను కూడగట్టి పార్టీ నిర్మాణానికి కృషి చేశారని వివరించారు. ఆయన నిరంతర అధ్యయనశీలి అని, విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో పోరాటాలకు సత్యం మాస్టారు నేతృత్వం వహించారని గుర్తుచేశారు. మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు, సర్పంచ్ సిహెచ్.లక్ష్మణరావు, సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, ఆర్.దిలీప్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్, హమాలీలు, రైస్‌మిల్లు కార్మికులు, ప్రజలు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలపై గుంటూరు జిల్లా మంగళగిరిలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ మంగళగిరి ప్రాజెక్టు సమావేశం బుధవారం జరిగింది. యూనియన్ నాయకులు హేమలత అధ్యక్షతన జరిగిన సదస్సులో సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే అదనపు వేతనం ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఏళ్ల తరబడి టిఎలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వేతనాలు కూడా ఏడాదికి రెండు నెలలు ఇవ్వడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రయివేటుపరం చేయలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లను విలీనం పేరుతో మూసేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోగా సిఐటియు పోరాటాల వల్ల కొంతవరకు వెనక్కు తగ్గిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, సిఐటియు నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి దర్శనార్థం వచ్చే యాత్రికులకు 2024 జనవరి నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను టిటిడి బుధవారం విడుదల చేసింది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం అక్టోబర్ 18 నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని టిటిడి అధికారులు తెలిపారు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన యాత్రికులు అక్టోబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 21న ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవా టికెట్లను అక్టోబర్ 21న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను అక్టోబర్ 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం, గదుల కోటాను అక్టోబర్ 23న ఉదయం 11 గంటలకు, వద్ధులు, దివ్యాంగులకు దర్శన టోకెన్ల కోటాను అక్టోబర్ 23న మధ్యాహ్నం 3 గంటలకు, ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటాను అక్టోబర్ 24న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్ అక్టోబర్ 25న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని తెలిపారు. డిసెంబరు నెలకు సంబంధించి అక్టోబరు 27న విడుదల చేస్తామని తెలిపారు. యాత్రికులు ఈ విషయాలను గమనించి వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

అయ్యన్న మృతదేహం

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో బుధ వారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళ్లకుంట గ్రామానికి చెందిన నర్రవరపు అయ్యన్న (55) తనకున్న మూడు ఎకరాలతోపాటు మరో 12 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో పత్తి, మిర్చి పంటలను సాగు చేసేవారు. పంటల సాగు నిమిత్తం రూ.12 లక్షల వరకు అప్పు చేశారు. గత మూడేళ్లుగా వర్షాభావం, చీడపీడలతో పంట చేతికందకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. అప్పులు తీర్చే మార్గంలేక తాను సాగుచేస్తున్న పొలంలోనే పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అయ్యన్న గతంలో సర్పంచ్‌గా పని చేశారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేశారు.

సహకార రంగం పరిరక్షణకు ఉద్యమం

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య,

సహకార రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని మోడీ ప్రభుత్వం చేస్తోన్న కుట్రలను పోరాటాలతో తిప్పికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.కార్పొరేట్లను వెనక్కు నెట్టి సహకార రంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. 'సహకార రంగాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై అనకాపల్లిలోని కార్మిక, కర్షక భవన్‌లో బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వ విధానాల కారణంగా నాశనమైన సహకార రంగాన్ని సరిదిద్దుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, సహకార వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వానికి వంతపలకడం విచారకరమన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడం కోసం సహకార వ్యవస్థను కార్పొరేట్ల చేతుల్లో పెట్టాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రయివేటు కంపెనీ, అసంఘటితరంగం, గ్రామీణ ప్రాంతంలో సహకార సొసైటీలు ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేరళలో సహకార రంగాన్ని అభివృద్ధి చేయడంతో మూడు లక్షల మందికి ఉద్యోగాలు లభించడంతో పాటు స్వతంత్రంగా సొసైటీల ద్వారా తమ అవసరాలను తీర్చుకోగలుగుతున్నారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ... సహకార రంగాన్ని ప్రత్యామ్నాయ రంగంగా అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సహకార సంఘాల్లో సభ్యులుకాని వారికి నామినేషన్ పద్ధతిపై చైర్మన్ పదవులు ఇవ్వడం సహకార రంగం స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. 50 శాతం షేర్లు ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు అప్పగించే ఎంఎసి చట్టాన్ని రద్దు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ.. సహకార సుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలని, అమూల్‌కు ప్రభుత్వ మద్దతు ఉపసహరించుకోవాలని, సొసైటీలకు రాయితీలిచ్చి ప్రోత్సహించాలని డిమాండ్‌చేశారు. తొలుత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి వి.కృష్ణయ్య, లోకనాథం, అప్పలరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సహకార సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ రెడ్డివెంకటరావు, గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ గంటా శ్రీరామ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఆర్ఇసిఎస్ యూనియన్ నాయకులు మళ్ల పరదేశినాయుడు, రాష్ట్ర సహకార, ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ నాయకులు డిఎస్ఆర్‌సి మూర్తి, పిఎసిఎస్, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమైక్య ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం

- కృష్ణాజలాల పున:పంపిణీ రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై గఫూర్, చంద్రమోహన్‌రెడ్డి, తులసిరెడ్డి తదితరులు

కృష్ణాజలాల పున:పంపిణీ వ్యవహారంపై రాష్ట్రంలోని బిజెపియేతర పార్టీలన్నీ సమైక్య ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పలువురు వక్తలు కోరారు. కృష్ణాజలాల పున:పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్, రాష్ట్ర భవిష్యత్, సీమ ప్రాజెక్టులపై కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో అప్పర్‌భద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడమే గాకుండా రూ.ఆరు వేల కోట్లను కేంద్రం కేటాయించిందని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కృష్ణా జలాలను పున:పంపిణీ చేయాలనే పేరుతో బ్రిజేష్ ట్రిబ్యునల్‌ను వేయడం దుర్మార్గమని తెలిపారు. 2025 నాటికి పోలవరం పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదమని తెలిపారు. దసరా అనంతరం విజయవాడలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ..కృష్ణాజలాల పున:పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తే అఖిలపక్షాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ముఖ్యమంత్రిని నిలదీశారు. ఉద్యమ ఎజెండాను రూపొందించి అధికార, ప్రతిపక్షాల ఎదుట ఉంచుతామని తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా చర్చ నడిచేలా కార్యాచరణకు రూపకల్పన చేస్తామన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 63 లక్షల హెక్టార్లలో 34 లక్షల హెక్టార్లలో వరి సాగు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు .పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రానికి రాహుకేతువులుగా మారాయన్నారు. తెలంగాణ అక్రమ ప్రాజెక్టుల కారణంగా నికర, మిగుల జలాలు ప్రశ్నార్థకంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు నేత దశరథరామిరెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు వనజ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ ప్రసంగించారు. కార్యక్రమానికి నగరంలోని పలువురు ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు.

ఎండ తీవ్రతకు రైతు మృతి

ప్రజాశక్తి - నౌపడ

సింహాచలం (ఫైల్ ఫొటో)

ఎండిపోతున్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి ఎండ తీవ్రతకు గురై రైతు మృతి చెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పంచాయితీలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పంచాయతీ పరిధిలోని సంధిపేటకు చెందిన బొంగు సింహాచలం (63) తన ఐదెకరాల భూమిలో వరి సాగు చేస్తున్నారు. వంశధార సాగునీరు అందక, వర్షాల్లేక పంట ఎండిపోతుండడంతో గ్రామంలోని పెద్ద చెరువు నుంచి మోటారు ఇంజన్‌తో నీరు పెట్టేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పొలంలోనే కుప్పకూలిపోయారు. గమనించిన చుట్టుపక్కల రైతులు వెళ్లి చూసేసరికే ఆయన ప్రాణాలు కోల్పోయారు.

విప్రోకు రూ.2,667 కోట్ల లాభాలు

- క్యూ2లో 5,015 మంది ఉద్యోగుల తగ్గుదల

బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో దిగ్గజ ఐటి కంపెనీ విప్రో నికర లాభాలు స్వల్పంగా పెరిగి రూ.2,667 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,649 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ2లో కంపెనీ రెవెన్యూ 0.1 శాతం తగ్గి రూ.22,520 కోట్లుగా చోటు చేసుకుందని ఆ కంపెనీ బుధవారం బిఎస్ఇ ఫైలింగ్‌లో తెలిపింది. "మార్కెట్‌లో సూక్ష్మ పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రగతిని కనబర్చాము. గడిచిన త్రైమాసికంలో 100 మిలియన్ డాలర్ల పైగా విలువ కలిగిన 22 ఎకౌంట్లను పొందాము. 2020-21తో పోల్చితే ఇది రెట్టింపు. గడిచిన తొమ్మిది నెలల్లో 1.3 బిలియన్ డాలర్ల విలువ చేసే పెద్ద కాంట్రాక్టును పొందాము." అని విప్రో సిఇఒ తియెరి డెలపోర్టీ పేర్కొన్నారు.

గడిచిన జులై- సెప్టెంబర్ కాలంలో విప్రో ఉద్యోగుల్లో 5,015 మంది తగ్గారు. దీంతో వరుసగా నాలుగో త్రైమాసికంలో నికర ఉద్యోగుల్లో తగ్గుదల చోటు చేసుకున్నట్లయ్యింది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న ఈ ఐటి దిగ్గజంలో ప్రస్తుతం 2,44,707 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రస్తుత అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసకంలో ఐటి సర్వీసుల నుంచి 2,617 -2,672 మిలియన్ డాలర్ల వ్యాపారం జరగొచ్చని అంచనా వేసింది. బుధవారం బిఎస్ఇలో విప్రో షేర్ విలువ 0.94 శాతం తగ్గి రూ.407.40 వద్ద ముగిసింది.

రాణించిన ఇండస్‌ఇండ్ బ్యాంక్

ప్రయివేటు రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 22 శాతం వృద్ధితో రూ.2,202 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,805.28 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 18 శాతం పెరిగి రూ.5,077 కోట్లకు చేరడం, ఇతర ఆదాయం 13.5 శాతం వృద్ధితో రూ.2,281.9 కోట్లుగా నమోదయ్యింది. ఈ రెండు అంశాలు బ్యాంక్ మెరుగైన ఫలితాలకు ప్రధాన మద్దతును అందించాయి. సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.93 శాతంగా, నికర ఎన్‌పిఎలు 0.57 శాతంగా నమోదయ్యాయి.

బజాజ్ ఆటో రెవెన్యూ 6% వృద్ధి

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో లిమిటెడ్ 2023 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 17.48 శాతం వృద్ధితో రూ.2,020కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,719 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.10,202.71 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో 6.22 శాతం వృద్ధితో రూ.10838.24 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.11,206 కోట్లకు చేరింది. 2023 సెప్టెంబర్ 30 నాటికి కంపెనీ వద్ద రూ.17,326 కోట్ల మిగులు నిధులు ఉన్నట్లు తెలిపింది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ ఎగుమతులు 8 శాతం పెరిగినట్లు వెల్లడించింది.



మారుతి 10 లక్షల ఆటోమెటిక్ యూనిట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి దేశంలో 10 లక్షల యూనిట్ల ఆటోమెటిక్ వాహనాలను విక్రయించి.. నూతన మైలురాయిని చేరినట్లు వెల్లడించింది. ఇందులో ఆటోగేర్ షిఫ్ట్ (ఎజిఎస్), 4స్పీడ్ ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్, అడ్వాన్సుడ్ 6స్పీడ్ ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్ (ఎటి) తదితర 16 మోడళ్లు ఉన్నాయని పేర్కొంది. 2014లో తొలిసారి ఎజిఎస్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ప్రస్తుతం ఎంఎస్ఐఎల్ 65 శాతం ఆటోమెటిక్ వాహనాలను విక్రయిస్తుందని పేర్కొంది. పరిశ్రమలోని ఈ విభాగంలో 27 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నట్లు వెల్లడించింది.

హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో నుంచి ఆరు కొత్త ఉత్పత్తులు



న్యూఢిల్లీ : వైద్య బీమా రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో కొత్తగా ఆరు ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. మరో రెండు సర్వీసులను అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది. ఆప్టిమా సెక్యూర్, ఆప్టిమా వెల్‌బీయింగ్, మైహెల్త్, ఎక్స్‌ప్లోరర్ తదితర ప్లాన్లు గ్లోబల్ హెల్త్‌కేర్ సౌకర్యాలను కలిగి అనిశ్చితులను అధిగమించేలా విస్తృత కవరేజీలను అందుకునేందుకు అనుమతిస్తాయని పేర్కొంది. ఆసుపత్రిలో చేరిన వినియోగదారులకు నగదు రహిత సౌలభ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపింది. వీటితో భారత్‌లోనే కాకుండా విదేశాలలో కూడా ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ జనరల్ ఇన్సూరెన్స్ రిటైల్ బిజినెస్ ప్రెసిడెంట్ పార్థనిల్ ఘోష్ తెలిపారు.

చక్కెర ఎగుమతులపై ఆంక్షలు పొడిగింపు

న్యూఢిల్లీ : చక్కెర ఎగుమతులపై విధించిన ఆంక్షలను పొడిగించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) తెలిపింది. గతంలో విధించిన గడువు అక్టోబర్ 31తో ముగియనుంది. ఆ తర్వాత కూడా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. అదే విధంగా ఇప్పటికే ఉన్న నిల్వల సమాచారాన్ని అందించాలని వ్యాపారులను ఆదేశించింది. ప్రస్తుత పండగ సీజన్ నేపథ్యంలో దేశీయంగా తగినన్ని చక్కెర నిల్వలను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిజిఎఫ్‌టి తెలిపింది.

2.40 లక్షల టెకీలపై వేటు



వాషింగ్టన్ : ప్రస్తుత ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా 2,40,000 మంది టెకీలపై వేటు పడిందని లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెల్లడించింది. వీరిని 1,059 టెక్నాలజీ కంపెనీలు తొలగించాయని పేర్కొంది. గతేడాది 1024 కంపెనీలు మొత్తంగా 1,54,336 మందిని ఇంటికి పంపించాయని తెలిపింది. వచ్చే డిసెంబర్ ముగింపు కల్లా తమ ఉద్యోగుల్లో 2.5 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు క్వాల్‌కమ్ ఈ వారంలో ప్రకటించిన విషయం తెలిసిందే.

సిస్కో సిస్టమ్స్, రోకు, మైక్రోసాఫ్ట్, పోకెమాన్ గో తదితర సంస్థలు ఉద్యోగులను తొలగించిన వాటిలో ఉన్నాయని తెలిపింది. గడిచిన రెండేళ్లలో ప్రతి గంటకూ 23 మంది టెకీలు కొలువులు కోల్పోయరని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా 2120 టెక్ కంపెనీలు దాదాపు 4 లక్షల మంది టెకీలను సాగనంపాయని లేఆఫ్.ఎఫ్‌వైఐ డేటా తెలిపింది.

సంపాదకీయం

ఇది యుద్ధ నేరమే

గాజాలోని ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ జరిపిన దాడి అత్యంత దుర్మార్గం. ఈ ఘటనలో 500 మందికిపైగా మృత్యువాత పడినట్లు వస్తున్న వార్తలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులు ఉండటం మరింత బాధాకరం. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పర్యటనకు కొన్ని గంటల ముందు ఇజ్రాయిల్ జరిపిన ఈ అమానుష దాడి పాలస్తీనీయుల పట్ల అది ఎంత క్రూరత్వంతో వ్యవహరిస్తోందో తెలియచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండటంతో ఆ దాడి తాము చెయ్యలేదని, తమపై దాడి చేయడానికి హమాస్ చేసిన ప్రయత్నమే మిస్‌ఫైర్ అయిందని ఇజ్రాయిల్ నిస్సిగ్గుగా బుకాయిస్తోంది. పాశ్చాత్య మీడియా కూడా దానినే ప్రచారంలో పెడుతోంది. పన్నెండు రోజులుగా సాగుతున్న ఈ పోరులో మొదటి రోజు మినహాయిస్తే విధ్వంసం సృష్టించిందంతా ఇజ్రాయిలే! దాడికి గురైన ఆస్పత్రిలో ఇజ్రాయిల్ దాడుల్లో సర్వస్వాన్ని కోల్పోయి శరణార్థులుగా మారిన 3 వేల మందికిపైగా పాలస్తీనీయులు, వారికి అదనంగా సాధారణ రోగులు చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిపై దాడి చేయడం ద్వారా ఇజ్రాయిల్ యుద్ధ నేరానికి పాల్పడింది. దీనికి బాధ్యత వహించకుండా హమాస్ మీదకి నెపం నెట్టివేయాలని చూడటం దాని తెంపరి తనాన్ని తెలియచేస్తోంది. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) చెబుతున్న మాటలను, ట్విట్టర్లో పోస్టు చేసిన సాక్ష్యాలు నమ్మశక్యంగా లేవని రష్యా పేర్కొంది. ఇజ్రాయిలే దీనికి పూర్తి బాధ్యత వహించాలని అరబ్ దేశాలన్నీ ముక్త కంఠంతో చెబుతున్నాయి.

మానవాళి పట్ల, ప్రపంచం పట్ల బాధ్యత ఉన్న వారెవ్వరైనా ఈ తరహా హింసాకాండను సమర్థించరు. కానీ, ఇంత దారుణ హింసాకాండ తరువాత కూడా ఇజ్రాయిల్‌ను బైడెన్ వెనకేసుకు రావడంతో అమెరికా దుర్నీతి మరోసారి ప్రపంచానికి వెల్లడైంది. బుధవారం నాడు ఇజ్రాయిల్లో జరిపిన సంఘీభావ పర్యటనలోనూ, ఆ తరువాత చేసిన ట్వీట్లలోనూ బైడెన్ అన్ని విధాల ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించారు. ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో హమాస్‌ను ఆయన పోల్చారు. దీనిని అదునుగా తీసుకున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు యుద్ధోన్మాదంతో మరింతగా రెచ్చిపోయారు. దాడులు తక్షణం ఆపకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ ఇరాన్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఇజ్రాయిల్‌ను మరింత రెచ్చగొట్టడమే బైడెన్ పర్యటన ఉద్దేశ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గాజాపై భూతల దాడులకు రంగం సిద్ధమవుతోందంటూ వస్తున్న వార్తలు ఈ సందర్భంగా గమనార్హం.

ఆస్పత్రిపై జరిగిన దాడి తరువాత ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం పట్ల ప్రపంచ దేశాలు స్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నాయి. తక్షణం దాడులను ఆపి, అమాయక ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆ దేశాలు కోరుతున్నాయి. మరోవైపు గాజాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రజానీకానికి మానవతా పూర్వక సాయానికి కూడా ఇజ్రాయిల్ షరతులు పెడుతుండటం చర్చనీయాంశంగా మారింది. లెబనాన్, జోర్డాన్, లిబియా, ట్యునీషియా, టర్కీ, మొరాకో, ఇరాన్‌లలో బుధవారం పెద్దఎత్తున పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరిగాయి. వేలాదిమంది ప్రజానీకం ఈ ప్రదర్శనల్లో భాగస్వాములయ్యారు. జో బైడెన్‌తో ఈజిప్టు, జోర్డాన్, పాలస్తీనా అథారిటీ నేతల భేటీ కూడా ఈ కారణంగానే రద్దు అయింది. మరోవైపు ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఇప్పటికే పది లక్షల మందికి పైగా అమాయక ప్రజానీకం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గాజా నుండి సరిహద్దు ప్రాంతానికి తరలివెళ్లారు. ఆ ప్రాంతం మీద కూడా ఇజ్రాయిల్ బాంబులు వేయడం మరీ దారుణం. అంతర్జాతీయ ఒప్పందాలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను తుంగలో తొక్కి సొంత గడ్డపైనే కాందిశీకులుగా, శరణార్థులుగా పాలస్తీనీయులను మార్చిన పాపిష్టి చరిత్ర ఇజ్రాయిల్‌ది. ఆక్రమించిన భూ భాగాలను ఖాళీ చేసి 1967కి ముందున్న సరిహద్దులతో తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారం. ఆస్పత్రిపై దాడి సంఘటనతో పరిస్థితి మరింత దిగజారింది. ఇది పెను విపత్తుగా మారకముందే తక్షణం యుద్ధం ఆపేలా ఇజ్రాయిల్‌పై ప్రపంచ దేశాలు ఒత్తిడి తీసుకురావాలి. భారత ప్రభుత్వం కూడా గుడ్డిగా అమెరికాను అనుసరించడం కాకుండా తన వైఖరిని సమీక్షించుకోవాలి. అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విధానానికి స్వస్తి పలికి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించాలి. పాలస్తీనా విమోచనా పోరాటానికి చిరకాలంగా భారత్ ఇస్తున్న మద్దతును కొనసాగించాలి.

మహనీయుని మాట

చావుబతుకులు ఎక్కడో లేవు..
ధైర్యంలోనే బతుకుంది..
భయంలోనే చావుంది.
- స్వామి వివేకానంద

ఇంటర్వ్యూ

అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలి

ఇజ్రాయిల్ యుద్ధ నేరాలను అమెరికా, యూరోపియన్ యూనియన్ కప్పిపుచ్చుతున్నాయని భారత్ లోని పాలస్తీనా రాయబారి అద్నాన్ అబు అల్హైజా అన్నారు. అంతేగాక, ఇప్పుడు ఇజ్రాయిల్ దేశ చరిత్రలో అత్యంత తీవ్రవాద ప్రభుత్వం ఉంది. అంతర్జాతీయ సమాజం ఇజ్రాయిల్‌పై గట్టి ఒత్తిడి తెస్తే తప్ప పాలస్తీనా ప్రజలకు న్యాయం లభించదు. 60 లక్షల మంది పాలస్తీనియన్లను శాశ్వతంగా లొంగదీసుకోవచ్చని ఇజ్రాయిల్ భావిస్తోందన్నారు. అద్నాన్ అబు 'దేశాభిమాని' పత్రికా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన ముఖ్యాంశాలు...

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సైన్యం దారుణమైన దాడులకు తెగబడుతోంది. అయితే అక్టోబర్ 7న ఇజ్రాయిల్ సరిహద్దుల్లో 'హమాస్' జరిపిన దాడికి ప్రతీకారంగా దీనిని అభివర్ణిస్తున్నారు. ఇజ్రాయిల్, దాని మద్దతుదారులు చేస్తున్న ఈ వాదనను మీరెలా చూస్తారు?

ఈ క్షణం వరకు పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న దాడులను ఆపలేకపోయారు. ఇజ్రాయిల్ చరిత్రలో ఇప్పుడున్నది అత్యంత తీవ్రవాద ప్రభుత్వం. ఇలాంటి యుద్ధ నేరాలు చేయడానికి ఎవరి సహాయం అవసరం లేదు. కానీ ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు అందిస్తోంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆ దేశం వెళ్లారు. అమెరికా విమాన వాహక నౌకలు ఇజ్రాయిల్ సరిహద్దులో ఉన్నాయి. ఇజ్రాయిల్ ఇప్పుడు స్వీయ దహనంలో ఉంది.

ఇజ్రాయిల్ ను సష్టించింది బ్రిటన్. అందుకు అమెరికా, ఫ్రాన్స్ వంటివి మద్దతు పలికాయి. ఇజ్రాయిల్ కేవలం సైనిక శక్తిపై ఆధారపడిన దేశం. అమెరికాకు ఇజ్రాయిల్ అత్యుత్తమ పెట్టుబడి అని అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. యూదులు ఆ విధంగానే చూస్తారు. ఇజ్రాయిల్ ఏర్పడి ఉండకపోతే, తానే ఇజ్రాయిల్‌ను ఏర్పాటుచేసి ఉండేవాడినని కూడా బైడెన్ చెప్పాడు. యుద్ధాలలో ఇజ్రాయిల్ ప్రమేయం కూడా బైడెన్ కు తెలుసు. 'మాతృ భూమి' అనే అబద్ధం ఆధారంగా సృష్టించబడిన ఇజ్రాయిల్ ఇప్పుడు పాలస్తీనియన్లను పొట్టన పెట్టుకుంటోంది. ఇజ్రాయిల్ కు జన్మనిచ్చిన వారు దీనిని అడ్డుకునేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదు.

అయితే ఇతర దేశాలు పాలస్తీనాకు మద్దతిస్తున్నాయా? ఉదాహరణకు లాటిన్ అమెరికా దేశాలు...?!

అవును, లాటిన్ అమెరికా దేశాలు మాకు మద్దతు ఇస్తున్నాయి. చైనా, గల్ఫ్ దేశాల మద్దతు కూడా వుంది. యూరప్ నుండి కూడా అనేక దేశాల మద్దతు ఉంది.

ప్రస్తుత పరిస్థితికి త్వరలో పరిష్కారం లభిస్తుందన్న ఆశ ఉందా...

గాజా ప్రజలు చాలా దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. ఇజ్రాయిల్ యుద్ధ మంత్రి గాజాపై దిగ్బంధనాన్ని ప్రకటించాడు. వారికి ఆహారం, నీరు, విద్యుత్, మందులు, ఇంధనం నిరాకరించబడ్డాయి. పాలస్తీనా ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. వారి భవనాలపై ఇజ్రాయిల్ బాంబులు వేస్తోంది. 10 లక్షల మంది ప్రజలను ఉత్తరం నుండి దక్షిణ గాజాకు తరలించాలని ఆదేశించింది. అంతేకాకుండా, ఇజ్రాయిల్ యుద్ధ మంత్రి గాజా లోని 22 లక్షల మంది పాలస్తీనీయులను 'మానవ మృగాలు' అన్నాడు. ప్రజాస్వామ్య దేశంలో ఒక మంత్రి ఇలా మాట్లాడతాడా? ఫాసిస్టు పాలనా ప్రతినిధి మాత్రమే ఇలా మాట్లాడతాడు. ఈ విధమైన దండయాత్రను మనం చవిచూస్తున్నాం. వారికి శాంతి అక్కర్లేదు. వారికి భూమి మాత్రమే కావాలి. 6 కోట్ల మంది పాలస్తీనా ప్రజలు ఎప్పటికీ తమ ఆక్రమణలోనే ఉండాలని వారు కోరుకుంటున్నారు.

హమాస్ దాడికి ఎంచుకున్న సమయానికి సంబంధించి కొన్ని వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయిల్ ప్రధాని రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్న సమయంలో ఇది మొదలవడాన్ని ఎలా చూస్తారు?

హమాస్ ఎదురుదాడి ప్రారంభించింది, దాడి కాదు. గత డిసెంబర్ నుంచి ఇజ్రాయిల్ నిరంతరం దాడులు చేస్తోంది. ఒక్క వెస్ట్ బ్యాంక్‌లోనే 260 మంది చనిపోయారు. అల్ అక్సా మసీదుపై ప్రతి రోజూ దాడులు జరుగుతున్నాయి. అల్-అక్సా మసీదులో పాలస్తీనా మహిళలతో ఇజ్రాయిల్ సైనికులు ఎలా ప్రవర్తించారో అందరూ చూశారు. పాలస్తీనా భూమి ప్రతి రోజూ ఆక్రమణకు గురవుతోంది. పాలస్తీనియన్లు ప్రతి రాత్రి అరెస్టు చేయబడుతున్నారు. ఇజ్రాయిల్ జైళ్లలో దాదాపు 5,000 మంది పాలస్తీనా ఖైదీలు ఉన్నారు. ఈ పరిస్థితి ఒక్క గాజాలోనే కాదు. ఇది వెస్ట్ బ్యాంక్‌లోనూ వున్నది. పాలస్తీనా ప్రజలు ప్రపంచంలోనే అత్యంత దారుణమైన దురాక్రమణను ఎదుర్కొంటున్నారు.

దురాక్రమణదారులకు పశ్చిమ దేశాల మద్దతు ఉంది. మాకు ఔదార్యం కాదు, డబ్బు కాదు. సమస్యకు రాజకీయ పరిష్కారం కావాలి. పాలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికారం కాపాడబడాలి. మన పిల్లలు ఇతర పిల్లల్లాగే ఆడుకుంటూ పెరిగే అవకాశం ఉండాలి. అంతేగాని వారు ప్రతిరోజూ దాడుల్లో చనిపోకూడదు.

అంతర్జాతీయ సమాజం తన బాధ్యతను నిర్వర్తించాలి. గాజా లోని 22 లక్షల మంది ప్రజలపై దిగ్బంధనానికి ముగింపు పలకాలి. వారికి నిత్యావసరాలు అందాలి. శాంతి ప్రక్రియను ప్రారంభించకుండా, పాలస్తీనా ప్రజలకు న్యాయం చేకూర్చకుండా అక్కడ శాంతి సాధ్యం కాదు. పాలస్తీనా అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీలో ఇప్పటి దాకా 800 తీర్మానాలు ఆమోదించారు. వీటిలో ఒక్క తీర్మానాన్నైనా అమలు చేయమని ఇజ్రాయిల్‌ను ఎవరూ అడగలేదు. శాంతి ప్రక్రియ చేపడతారని ఆశిస్తున్నాం. ఈ ప్రాంతంలో ఇదే చివరి యుద్ధం కావాలని ఆశిస్తున్నాం. ఇజ్రాయిల్‌ది వర్ణవివక్ష పాలనని ప్రకటించడానికి పశ్చిమ దేశాలు సిద్ధంగా ఉండాలి. ఈ ప్రయోగం దక్షిణాఫ్రికాలో విజయం సాధించింది.

ఈ విషయంలో మీడియా పాత్ర ఏమిటి?

మీడియా ముఖ్యంగా పాశ్చాత్య మీడియా ఎప్పటిలాగే ఇజ్రాయిల్ వైపు ఉంది. ఎందుకంటే అధిక శాతం మీడియా యూదులు లేదా వారి మద్దతుదారుల సొంతం. సోషల్ మీడియా రాకతో పరిస్థితి మారిపోయింది. సోషల్ మీడియా ప్రభావం సాంప్రదాయ మీడియాపై పడసాగింది. దాంతో యూరోపియన్ యూనియన్ సోషల్ మీడియాపై కఠినమైన నియంత్రణలను ప్రవేశపెట్టింది. ట్విటర్ లేదా యూ ట్యూబ్‌లో ఇజ్రాయిల్ వ్యతిరేక సమాచారం ఏదీ కనిపించదని యూరోపియన్ యూనియన్ నొక్కి చెప్పింది.

భారతదేశం నుండి పాలస్తీనాకు లభిస్తున్న మద్దతుతో మీరు సంతృప్తి చెందారా...?

భారతదేశంతో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. భారత్‌కు మంచి అవకాశం లభించింది. గాజా సరిహద్దును తెరిచి, నిత్యావసర వస్తువుల పంపిణీకి అవసరమైన పరిస్థితులను కల్పించాలని ఇజ్రాయిల్‌ను భారత్ కోరాలి. ఇజ్రాయిల్ చేస్తున్నది యుద్ధ నేరం. గాజా లోని ఆసుపత్రులను నాశనం చేసే ఎత్తుగడ కూడా ఉంది. ఈ పరిస్థితికి ముగింపు పలకాలి.

ఇజ్రాయిల్‌లో ప్రాణ నష్టానికి సంబంధించి అతిశయోక్తితో కూడిన వార్తలు వస్తున్నాయి. ఎక్కడైనా సరే మరణం బాధాకరమైనది. అయితే ఇజ్రాయిల్ ప్రధాని కార్యాలయం నుంచి అసత్య ప్రచారం జరుగుతోంది. ఇజ్రాయిల్ పిల్లలను హమాస్ చంపిందనే అబద్ధపు వార్తకు సంబంధించి సిఎన్ఎన్ రిపోర్టర్ క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి. ★

కవిత్వం

సెబ్బాష్ రా నాన్న...

సెబ్బాష్ రా నాన్న! సెబ్బాష్!!
ఆడపిల్ల అక్కడే పడుండే పుల్ల కాదనీ
కాపురానికి పిల్ల తప్ప కన్నీళ్ళ బిందె కాదనీ
వల్లకాడైనా అత్తింటి కాళ్ళ కాడి కట్టె పోగు కాదనీ
చావురేవుల పాతివ్రత్యమే పరమ సత్యం కాదనీ
గతకాలపు సనాతనంపై తిరుగుబాటు కేతనమై
ఎదురేగి కూతురికి స్వాగతం పలికావే
మేళతాళాలతో పుట్టింటి హక్కును చాటావే
అందుకురా నాన్న! అవునన్నా కాదన్నా
నువ్వప్పుడు సెబ్బాష్ నాన్నవయ్యావు.

ఇక నుంచి సీత, సావిత్రి కథలే కాదు
కొత్త కథలు .. నాన్న- కూతురు కథలు రాయి
ఆడ పిల్లే కాదు, ఇక్కడకూ పిల్లేనని రాయి
మెట్టినింటి కథలే కాదు, పుట్టింటి కథలూ రాయి
ఆస్తి హక్కే కాదు, ఆత్మరక్షణ హక్కు కథలూ చెక్కు
కూతురుంటేనే మనిషి జాతికి జన్మనే కథ రాయి
లేకుంటే ఆ కథ అక్కడితోనే అంతమనే కథ రాయి.

ఇప్పుడేరా అబ్బాయి .. పరువు కథ బరువు దింపి
కూతురి మరో జన్మకు 'నాన్న' సాక్ష్యంగా మిగిలావు
అందుకే అంటున్నా! సెబ్బాష్ రా నాన్న అని
ఆ పేరు నాన్న-అమ్మాయని నిలపగలిగేలా
అమ్మ ఇంటిపై ఇక నుంచి నాన్న పతాకగా ఎగురు.

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఇంటి సమస్య తీరేదెన్నడో...!

యం.వి. ఆంజనేయులు



నివాస గృహాలను కేటాయించడం ప్రభుత్వంలో ఉన్న పార్టీల భిక్ష కాదు. నివాసం పొందటం ప్రజల హక్కు. గృహ వసతి కల్పించడమంటే... ప్రభుత్వంలో ఉన్న వారికిష్టమైన రీతిలో నిర్మించడం కాదు. కుటుంబం జీవించేందుకు తగిన ప్రదేశంలో, చక్కని నిర్మాణంతో ఇల్లు నిర్మించాలి. సరిపడినంత ఇల్లు ఉండాలి. అంటే కుటుంబానికి కనీసం 120 చ.గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలి. పరిశుభ్రమైన పరిసరాలు, తగినంత గాలి, వెలుతురు, స్వచ్ఛమైన నీరు, విద్యుత్, మురుగు నీటి పారుదల, రహదారులు కల్పించాలి. విద్య, వైద్యం లాంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలి. తమ ఉపాధికి వీలైనంత దగ్గరగా ఉండాలి. నివాస గృహం కేటాయించడం వలన ఉపాధి కోల్పోకూడదు.

రాష్ట్రంలో ఇళ్ళ సమస్య తీవ్రంగా ఉన్నది. కేవలం పేదలకు మాత్రమే కాదు. మధ్యతరగతి ప్రజలకు కూడా ఇంటి నిర్మాణం అనేది తీవ్ర సమస్యగా మారింది. ముఖ్యంగా భూముల రేట్లు విపరీతంగా పెరగటంతో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చింది.

2018 నాటికి ఆంధ్ర ప్రదేశ్ పట్టణాలలో సొంత ఇళ్ళ గల వారు 43.3 శాతం, అద్దెలకు వుండేవారు 49.9 శాతం, ఇతరులు 6.8 శాతం ఉన్నారు. రాష్ట్ర ప్రజానీకంలో దాదాపు సగం మంది సొంత ఇళ్ళు లేనివారని అర్థం అవుతున్నది. పట్టణాలలో 36,54,000 కుటుంబాలు ఉన్నాయి. దీని ప్రకారం చూసినా 18,23,346 కుటుంబాలకు సొంత ఇళ్లు లేవు. వీరందరికీ గృహాలు నిర్మించాలంటే మన రాష్ట్రంలో 18,23,346 ఇళ్లు కావాలి. కాని ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన ఇళ్లు16,84,502. అందులో నిర్మించ తలపెట్టినవి 13,92,855. నిర్మించ తలపెట్టిన గృహాలకుగాను కేంద్ర ప్రభుత్వం మొదటి కిస్తీగా రూ. 4032 కోట్లు విడుదల చేస్తే అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2556 కోట్లు విడుదల చేసి మిగిలిన రూ. 1476 కోట్లు దారి మళ్ళించిందని, ఈ రూ. 1476 కోట్లుతో బాటుగా రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 885 కోట్లు తక్షణమే విడుదల చేయాలని పిఎంఎవై అధికారులు కోరినట్లుగా 'మింట్' పత్రిక (27.10.2022) తెలియజేసింది. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో చూడాల్సిందే.

ఇదిలా ఉండగా, మన రాష్ట్రంలో 21.76 లక్షల ఇళ్ళ నిర్మాణాలు చేపట్టామని, అందులో 7.43 లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేశామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇటీవల సామర్లకోట సభలో చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిందే 16,84,502 అయితే, అందులో నిర్మించ తలపెట్టినవే 13,92,855. అయితే రాష్ట్రంలో 21.76 లక్షల ఇళ్ళు నిర్మాణాలు చేపట్టామని చెప్పటం ఆలోచించాల్సిన విషయమే. కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకన్నా సుమారు 4.92 లక్షల ఇళ్ళు అదనంగా నిర్మిస్తున్నట్లుగా ముఖ్యమంత్రి చెప్పారు. అదనంగా నిర్మించే ఈ ఇళ్ల ఖర్చును కేవలం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నదా అన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెప్పాలి.

ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా 21.76 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయి, లబ్ధిదారులకు అందిస్తే రాష్ట్రంలో అందరికీ సొంత ఇళ్లు లభిస్తాయి. అయితే ఈ ఇళ్ళ నిర్మాణం కేవలం పేదలకు ఉద్దేశించినది మాత్రమే. రాష్ట్రంలో అన్ని పట్టణాలలో మధ్యతరగతి వారు అద్దెకు ఉంటున్నారు. మధ్యతరగతి వారికి ఇళ్లు నిర్మించటం లేదు. గతంలో హౌసింగ్ బోర్డు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టినప్పుడు అల్పాదాయ వర్గాలకు ఎల్ఐజి పేరుతో, మధ్య ఆదాయ వర్గాల వారికి ఎమ్ఐజి పేరుతో, అధిక ఆదాయ వర్గాలకు హెచ్ఐజి పేరుతో స్థలాలు కేటాయించటం, ఇళ్ళు నిర్మించటం చేసేవి. నేడు మధ్య ఆదాయ వర్గాల వారికి, అధిక ఆదాయ వర్గాల వారికి ఇళ్ళు లేదా ఇళ్ళ స్థలాలు కేటాయించటం లేదు. రియల్ ఎస్టేట్ విపరీతంగా పెరగటంతో మధ్యతరగతి వర్గం స్థలం కొని ఇళ్ళ నిర్మించుకోలేక అపార్టుమెంట్లు కొనుక్కుంటున్నారు. వాటి ధరలు కూడా విపరీతంగా పెరగటంతో పట్టణాల శివారు ప్రాంతాలలో నిర్మించే అపార్టుమెంట్లు తక్కువ ధరకు దొరుకుతాయని శివారు ప్రాంతాల వైపు వెళ్తున్నారు. కొంత మందికి అవి కూడా అందుబాటులో ఉండటంలేదు. నేడు మధ్యతరగతి వారు కారు కొనగలరు. కాని, స్థలం కొని ఇల్లు నిర్మించుకొనే పరిస్థితి లేకుండా పోయింది.

ఇల్లు ఎలా ఉండాలి అనే అంశంపై అనేక కేసులలో సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. 1996లో "చిమేలీ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్" కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం "నివాస హక్కు (రైట్ టు షెల్టర్) అంటే కేవలం శరీరానికీ, అవయవాలకు మాత్రమే నివాసం కాదు. సగటు మనిషి మానసికంగా, శారీరకంగా మేధోపరంగా, తాత్వికంగా ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. నివాస హక్కు అంటే ఆ నివాసం మనిషి జీవించేందుకు వీలైన ప్రదేశం, చక్కని నిర్మాణం, పరిశుభ్రమైన పరిసరాలు, తగినంత గాలి, వెలుతురు, స్వచ్ఛమైన నీరు, విద్యుత్, మురుగునీటి పారుదల సౌకర్యం, మిగిలిన ఇతర సౌకర్యాలు (రహదారులు లాంటివి) ఉండి, వారు తమ రోజువారీ వృత్తులు చేసుకునేటందుకు అనువుగా ఉండటం' అని వ్యాఖ్యానించింది. అంతే కాకుండా ప్రజాస్వామ్యంలో ప్రతి మనిషికి మానసికంగా, శారీరకంగా మేధోపరంగా, తాత్వికంగా ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా శాశ్వత నివాసం ఉండాలని, ఇది కల్పించటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది.

కొన్ని కోర్టు తీర్పులను బట్టి మనం ఈ విషయాలను నిర్ధారించవచ్చు. నివాస గృహాలను కేటాయించడం ప్రభుత్వంలో ఉన్న పార్టీల భిక్ష కాదు. నివాసం పొందటం ప్రజల హక్కు. గృహ వసతి కల్పించడమంటే ప్రభుత్వంలో ఉన్న వారికిష్టమైన రీతిలో నిర్మించడం కాదు. కుటుంబం జీవించేందుకు తగిన ప్రదేశంలో, చక్కని నిర్మాణంతో ఇల్లు నిర్మించాలి. సరిపడినంత ఇల్లు ఉండాలి. అంటే కుటుంబానికి కనీసం 120 చ.గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలి. పరిశుభ్రమైన పరిసరాలు, తగినంత గాలి, వెలుతురు, స్వచ్ఛమైన నీరు, విద్యుత్, మురుగు నీటి పారుదల, రహదారులు కల్పించాలి. విద్య, వైద్యం లాంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలి. తమ ఉపాధికి వీలైనంత దగ్గరగా ఉండాలి. నివాస గృహం కేటాయించడం వలన ఉపాధి కోల్పోకూడదు.

వీటన్నింటిని తుంగలో తొక్కి మన ప్రభుత్వాలు కేవలం 25 చ.మీ.లలో ఇరుకు గదులు నిర్మించి ఇస్తున్నాయి. పాత మురికి వాడల నుంచి జనాన్ని తరలించి నూతన మురికి వాడలను తయారు చేస్తున్నాయి. పేదలకు అపార్టుమెంట్లు నిర్మించి ఇళ్లు కేటాయిస్తున్నారు. వీటి వలన అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాటిలో కొన్ని ముఖ్య సమస్యలు...

ప్రతి వ్యక్తికీ వ్యక్తిగత అవసరాలు ఉంటాయి. ఇంట్లో నివాస స్థలం చిన్నది కావటంతో ఎదిగే పిల్లలు ఉన్న కుటుంబంలో తల్లిదండ్రులకు గోప్యత ఉండటంలేదు. ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చే అపార్టుమెంట్లకు లిఫ్టు సౌకర్యం ఉండదు. దానితో పైఅంతస్తులలో ఉండేవారు పైకి కిందకు దిగటం ఇబ్బంది అవుతున్నది. ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చే అపార్టుమెంట్లకు అసోసియేషన్లు లేవు. దాని నిర్వహణ ప్రభుత్వ యంత్రాంగం చేతిలోనే ఉంటుంది. దీనితో ప్రతిదానికి స్థానిక అధికార యంత్రాంగం మీద ఆధారపడవలసి వస్తున్నది. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, డ్రైనేజి సమస్యలు, మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయి. వాటిని వ్యక్తులుగా పరిష్కరించుకోలేరు. అపార్టుమెంట్‌లో ఉన్న వారందరూ ఉమ్మడిగా పరిష్కరించుకోవాలి. ఈ అపార్టుమెంట్ ఇచ్చేదే పేదలకు. ఇల్లు ఇచ్చినంత మాత్రాన వారు వెంటనే ధనవంతులైపోరు. నెలనెలా మెయింటెనెన్స్ చెల్లించగలిగే స్తోమత కూడా వారిలో చాలామందికి లేదు. మంచి నీటి కోసం 3, 4 అంతస్తుల నుండి కిందకుదిగి మంచి నీరు పట్టుకొని ఆ బరువుతో మరల అన్ని అంతస్తులు ఎక్కవలసి వస్తున్నది. ఇది చాలా ఇబ్బందికరంగా తయారయింది. మున్సిపల్ వాటర్ వచ్చిన సమయంలోనే మోటారు ద్వారా 4 అంతస్తులపైన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు ఎక్కిస్తారు. మోటారు చెడి పోయినా, లేక మధ్యలో ట్యాంకులో నీరు అయిపోయినా, వాడుక నీటికి కూడా అన్ని అంతస్తులు దిగి నీటిని పైకి మోసుకు పోవలసిందే. ఇప్పటికీ కొంతమంది పేదలు వంటకు, లేదా నీళ్లు కాచుకోవటానికి కట్టెల పొయ్యి మీద ఆధారపడేవారు ఉన్నారు. ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చే అపార్టుమెంట్లలో కట్టె పొయ్యి పెట్టుకునే అవకాశంలేదు. కొంతమంది నెలనెలా గ్యాస్ కొనుక్కునే స్థోమత లేనివారుకూడా ఉన్నారు. వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చే అపార్టుమెంట్ల నిర్మాణం నాశిరకంగా ఉండటంతో పైఅంతస్తుకు నిర్మించిన శ్లాబు కారటం. వాటర్ ట్యాంకులు కారటం జరుగుతున్నది. వీటి రిపేరు వారికి పెద్ద సమస్యగా మారింది. పేదవాడు తన పనికి ఉపయోగపడక పోయినా ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చే అపార్టుమెంట్లకు వెళ్ళవలసిందే. దీంతో కొంతమందికి ఆ ఇళ్లు తమ పనికి ఆటంకంగా తయారవుతున్నాయి. రోడ్లు విశాలంగా వదిలినప్పటికీ ఆ అపార్టుమెంట్లలో జీవనం ఆధునిక మురికివాడలను తలపిస్తున్నాయి.

మధ్యతరగతి గృహ నిర్మాణ సమస్య

సాధారణంగా ఒక ప్రాజక్టు మొత్తం ఖరీదులో భూమి ధర 20 శాతానికి మించకూడదు. కాని ప్రస్తుత పరిస్థితిలో కొన్ని సందర్భాలలో ఇల్లు కట్టుబడి ఖర్చుకన్నా భూమి ధర మించి పోతున్నది. దీనితో ఇల్లు కట్టుకుందామనుకున్న మధ్యతరగతి ప్రజలకు స్థలం కొని తన అభిరుచికి తగినట్లుగా ఇల్లు కట్టుకునే పరిస్థితి లేకుండా పోతున్నది. అందువలన మధ్యతరగతి ప్రజలకు, ముఖ్యంగా కార్మిక వర్గానికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలి. అయితే మధ్యతరగతి వర్గానికి ఇళ్ళు ఉచితంగా ఇవ్వనవసరంలేదు. ఆనాటి గృహ నిర్మాణ ధరలో 20 శాతానికి మించకుండా భూమి రేటును నిర్ణయించి ప్రభుత్వమే మధ్యతరగతి ప్రజలకు అమ్మాలి.

(వ్యాసకర్త టాక్స్ పేయర్స్ అసోసియేషన్ సెక్రెటరీ, విజయవాడ)

★

అదానీ గ్రూప్‌పై విచారణ జరిపించండి : రాహుల్

- విద్యుత్ చార్జీల రూపంలో రూ.12 వేల కోట్ల దోపిడీ

న్యూఢిల్లీ : అదానీ గ్రూపుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. విద్యుత్ చార్జీల రూపంలో ప్రజల నుంచి 12 వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిందని ఆరోపించారు. ఏఐసీసీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అదానీ వ్యవహారంలో విచారణకు ఆదేశించి విశ్వసనీయతను నిరూపించుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. 'ఈ విషయంలో మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారు? నేను కేవలం ఆయనకు సహాయపడుతున్నాను. అదానీపై విచారణను ప్రారంభించి విశ్వసనీయతను నిరూపించుకోండి. నిష్కళంకుడిగా బయటికి రండి' అని సూచించారు. అదానీ గ్రూప్ మార్కెట్ విలువ కంటే అధిక ధర చెల్లించి కోట్లాది రూపాయల విలువ కలిగిన బొగ్గును దిగుమతి చేసుకున్నదని అంటూ ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికలో వచ్చిన వార్తను రాహుల్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. బొగ్గు దిగుమతుల కోసం అధిక ధర చెల్లించి, ప్రజల జేబుల నుండి 12 వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని రాహుల్ ఆరోపించారు. ఇండోనేషియా నుంచి అదానీ బొగ్గును కొనుగోలు చేశారని, భారత్ చేరేటప్పటికి దాని విలువ రెట్టింపు అయిందని అన్నారు. దీని ప్రభావం దేశంలో విద్యుత్ ఛార్జీలపై పడిందని, వినియోగదారులు ఎక్కువ ధర చెల్లించాల్సి వచ్చిందని వివరించారు. పత్రికలో వచ్చిన ఈ కథనం ప్రపంచంలో ఏ ప్రభుత్వాన్నైనా పడగొడుతుందని, అయితే మన దేశంలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. అదానీకి ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని అంటూ ఆయన వెనుక ఏ శక్తి ఉన్నదో అందరికీ తెలుసని రాహుల్ తెలిపారు.

దసరా.. దరువు

- కూరగాయల ధరలు పైపైకి
- నాణ్యత పేరిట కిలోకి రూ.20పైనే పెంపు
- రైతు బజార్‌లో నాణ్యత లేని కూరగాయలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దసరా దరువు మొదలైంది. గత నెల రోజులుగా సామాన్యునికి అందుబాటులో ఉన్న కూరగాయలు మళ్లీ ఒక్కసారిగా కొండెక్కి కూర్చున్నాయి. రైతు బజారు ధరతో పోల్చితే బహిరంగ మార్కెట్లో కిలోకు సుమారు రూ. 20పైనే విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో ధరలను చూసిన కొనుగోలుదారులు నోరెళ్లబెడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో నాణ్యత పేరుతో ధరల ఎక్కువకు విక్రయిస్తుంటే రైతు బజార్‌లో నాణ్యత లేనివి ఉండడంతో ధర తక్కువకు విక్రయిస్తారని చెబుతున్నారు. వినియోగదారుల రద్దీని బట్టి కూరగాయల ధరలు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రానికి వేర్వేరుగా పెరుగు తున్నాయి. దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో సుమారు 10 రోజులపాటు చాలా మంది మాంసాహారానికి దూరంగా ఉండటం పరిపాటి. మరో పక్క భవానీ దీక్షలు ఆచరించే భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో కూరగాయల వినియోగం భారీగా పెరిగింది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయాలు సాగిస్తున్నారు. దసరా ఉత్సవాలు ముగిసే వరకూ కూరగాయల రేట్లు దిగొచ్చే పరిస్థితి లేనేలేదని వ్యాపారులు తెగేసి చెప్పడం విశేషం.

ఒక్కో చోట.. ఒక్కో ధర..

బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు ఒక్కోచోట ఒక్కోలా ఉంటున్నాయి. ప్రస్తుతం దొమ్మేరు రకం వంకాయలు కిలో రూ.60ల వరకూ విక్రయిస్తున్నారు. బీరకాయలు రూ.50, టమాటా రూ.40, బెండకాయలు రూ.40, దొండకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.60, బంగాళాదుంపలు రూ.50, క్యారట్ రూ.60, క్యాప్సికం రూ.120, బీట్‌రూట్ రూ.60, చిక్కుళ్లు రూ.120 పలుకుతున్నాయి. రైతు బజార్‌లో అయితే ధరలు సగానికి సగం ఉన్నాయి. బీరకాయలు కిలో రూ.24, బెండకాయలు రూ. 30, బంగాళాదుంపలు రూ. 29, వంకాయలు రూ. 30 టమాటా రూ. 24 చొప్పున ఉన్నాయి. ఇక చిక్కుళ్లు రూ. 100, ఆగాకర రూ. 90, బీట్‌రూట్ రూ. 40, క్యారట్ రూ. 40, అరటికాయలు 3 రూ.20, ఆకు కూరలు అయితే రెండు కట్టలు రూ.10లు ఉన్నాయి. అదే బహిరంగ మార్కెట్ లో అయితే ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఒక్కో రకంపై కిలో రూ.20 నుంచి రూ.30ల పైనే వేసుకుని విక్రయిస్తున్నారు. రైతు బజార్‌లో విక్రయించే కూరగాయల్లో అంతగా నాణ్యత లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో కూరగాయలనే ఆశ్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో అయితే కిలో రూ. 10లు మాత్రమే తేడా ఉంటుంది. ప్రస్తుతం దసరా కావడంతో ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఉదాహరణకు ఏదైనా కూరగాయల ధర కిలో రూ.90లు చెబితే అర కిలో రూ.50లకు, పావు కిలో రూ.30లు చొప్పున విక్రయాలు చేస్తున్నారు.

కొండెక్కిన కొత్తిమీర

ఇక కొత్తిమీర ధర కొరకొర మంటోంది. వ్యాపారులు కొత్తిమీరను పెద్దపెద్ద కట్టల లెక్కన కొనుగోలు చేసి వాటిని పెద్ద, చిన్న కట్టలుగా కట్టి మార్కెట్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం 130 కట్టలు రూ.3,600 నుంచి రూ.3,800ల వరకూ ధర ఉందని వ్యాపారులు చెబుతున్నారు. రెండు రోజుల కిందట ఈ ధర మరింత ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు కాస్త తగ్గిందని అంటున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంతో పాటు ఇతర అన్ని మార్కెట్లు, రైతుబజార్లలో బెంగుళూరు కొత్తిమీర మాత్రమే అందుబాటులో ఉంది. వాస్తవానికి జిల్లాలోని తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామ పరిసరాలు కొత్తిమీర, ఆకుకూరల సాగు అధికంగా జరుగుతోంది. అక్కడ పంట చేతికి రావాలంటే మరో నెలరోజులైనా పడుతుందని చెబుతున్నారు. చుక్కకూర, మెంతికూర పెద్దగా మార్కెట్లోకి రావడం లేదు. తోటకూర, పొన్నగంటి కూర, బచ్చలికూర, గోంగూర మాత్రమే లభిస్తున్నాయి. ఇలా ధరలు భారీగా పెరగడంతో ఏం తిని బతకాలంటూ ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగం అమల్లో ఉందా?

- కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి -విజయనగరం కోట

రాష్ట్రంలో రాజ్యాంగం అమలులో ఉందా అని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం కోట జంక్షన్ వద్ద వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'నీ కోసం దీక్షబూని సాగుతాం చంద్రన్నా' పేరిట జరిగిన కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు పాల్గొని గాంధీ బొమ్మకు, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రాష్ట్రంలో ప్రశ్నిస్తే ఎవరినైనా జైల్లో పెడుతున్నారని, విచారణ మాత్రం వారికి నచ్చినప్పుడు చేస్తున్నారని అన్నారు. గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సుదీర్ఘకాలంపాటు అభివృద్ధి పథంలో నడిపించిన చంద్రబాబును 40 రోజులుగా జైలులో పెట్టడం అమానుషమని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిమిడి నాగార్జున, ఐవిపి రాజులు మాట్లాడుతూ..రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. అంతకుముందు నగరంలోని పిడబ్ల్యు మార్కెట్‌లో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా వర్తకులకు, కొనుగోలుదారులకు కరపత్రాలను అశోక్‌గజపతిరాజు పంచిపెట్టారు.

మహిళా మావోయిస్టు, మిలీషియా సభ్యుల అరెస్టు

ప్రజాశక్తి-ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా)

స్టేట్ స్పెషల్ పోలీస్ పార్టీకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు గొల్లగుప్ప శివారు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించి మావోయిస్టు పార్టీ సభ్యురాలు సోడి మంగిని, ముగ్గురు మిలీషియా సభ్యులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎటపాక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంపచోడవరం ఒఎస్‌డి కెవి.మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఒఎస్‌డి తెలిపిన వివరాలు ప్రకారం... పోలీసు పార్టీపై మందు పాతర పేల్చి హతమార్చాలని పథకం అమలు భాగంగా మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు, మిలీషియా సభ్యులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు గొల్లగుప్ప శివారులో కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టు పార్టీ సభ్యురాలు సోడి మంగి, ముగ్గురు మిలీషియా సభ్యులు పట్టుబడ్డారు. మరి కొంత మంది తప్పించుకున్నారు. పట్టుబడ్డ వారి వద్ద నుండి 2 డిటోనేటర్లు, 1 మీటర్ కార్డెక్ష్ వైర్, ఒక బాటరీ, ఐరన్ ముక్కలు, ఎలక్ట్రికల్ వైర్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సోడి మంగి (25)ది ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా, అర్లంపల్లి గ్రామం కాగా, మిలీషియా సభ్యులు మడకం లింగ (24)ది అదే జిల్లా బంగారు చెలక గ్రామం, మడకం రామయ్య (50), కురుసం భీమయ్య (25)లది అదే జిల్లా మైత గ్రామం. సోడి మంగి 2018లో మావోయిస్టు పార్టీ సభ్యురాలిగా చేరారు. ఆమె చింతూరు సబ్ డివిజన్ పరిధిలోనూ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం పరిధిలోనూ 25 నేరాల్లో ముద్దాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎటపాక మండలం చెరువు గుంపు గ్రామానికి చెందిన మడివి రాజ్ కుమార్‌ను కిడ్నాప్ చేసి ఛత్తీస్‌ఘడ్ మైత వద్ద చంపిన ఘటనలో, చింతూరు మండలం సరివెల వద్ద ట్రావెల్స్ బస్సు దహనం ఘటనలో, బురకన కోట గ్రామంలో సోయం సుబ్బయ్యను పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో చంపిన ఘటనలో పట్టుబడిన నలుగురు పాల్గొన్నారు. జీరగూడలో పోలీసులపై మావోయిస్టులు జరిపిన అంబుష్ దాడిలో 22 మంది సిఆర్‌పిఎఫ్ కమాండోలు మరణించిన ఘటనలో సోడి మంగి పాల్గొన్నట్లు ఒఎస్‌డి మహేశ్వరరెడ్డి వెల్లడించారు. నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరించినా, సంఘ విద్రోహక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మహేశ్వరరెడ్డి కోరారు. ఈ సమావేశంలో సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కమల్ వీర్ యాదవ్, అసిస్టెంట్ కమాండెంట్ హేమంత్ కుమార్ శర్మ, ఎటపాక సిఐ గజేంద్ర కుమార్, ఎస్సై కె పార్థ సారధి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'గెయిల్'కు 'గీతం' సాంకేతిక సహకారం

ప్రజాశక్తి- మధురవాడ

కేంద్రప్రభుత్వ మహరత్న కంపెనీలలో ఒకటైన గెయిల్, వివిధ ప్రాంతాలలో ఉపయోగిస్తున్న గ్యాస్ పైప్‌లైన్‌లకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, బుధవారం వాటిని అధికారికంగా గెయిల్ సంస్థకు బదలాయించింది. గెయిల్ విశాఖ-సికింద్రాబాద్ ఎల్‌పిజి పైప్‌లైన్ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఎస్.రావు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అధికారిక పత్రాలను గీతం రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్.ఎస్.రావు మాట్లాడుతూ తమకు ఎదురైన సాంకేతిక సమస్యకు గీతం టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ చంద్రమౌళి అతితక్కువ సమయంలో పరిష్కారం చూపారని అభినందించారు. భవిష్యత్తులో మరికొన్ని ప్రాజెక్టులను గీతం వర్సిటీకి ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎల్‌పిజి. పైప్‌లైన్ పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గీతం రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ గీతం టెక్నాలజీ అనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) ద్వారా రాష్ట్రంలోని విద్యాలయాలకు పరిశ్రమలకు మధ్య సంబంధాలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలు తమ సాంకేతిక సమస్యలను జిటెక్ దృష్టికి తెచ్చి, పరిష్కారం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో గీతం టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ఆఫీసర్ డాక్టర్ చంద్రమౌళి, గెయిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.రామకృష్ణ, మెకానికల్ విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, జి-టెక్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్ శాస్త్రి, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.విశ్వనాథ్ చైతన్య పాల్గొన్నారు.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.

ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.601, 6వ అంతస్తు, అమితి భవనం, అగస్త్య కార్పొరేట్ పార్క, కమని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురు, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబై-400070 టి+91 22 3802 4000, www.piramalfinance.com

అనుబంధం IV స్వాధీనతా నోటీసు (స్థిరాస్థి కొరకు)
ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2022 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడింది(డిహెచ్ఎఫ్ఎల్) యొక్క ఆధీకృత అధికారి దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని 60 రోజులలోగా చెల్లించవలెనని రుణగ్రహీత(లు)/హామీదారులకు డిమాండ్ నోటీసు జారీ చేయడమైంది. రుణగ్రహీత తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, సదరు రూల్స్‌లోని 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ ఆధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనపరచుకోవడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను రక్షించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి, సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలకు రుణగ్రహీత యొక్క దృష్టిని ఆహ్వానించబడుతుంది. ప్రత్యేకించి రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానికాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే లావాదేవీలు పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటడ్ (డిహెచ్ఎఫ్ఎల్) యొక్క తనఖాకు లోబడి ఉంటాయని తెలపడమైనది

క్ర. సం	రుణగ్రహీతలు/హామీదారుల పేర్లు:	సెక్యూర్ట్ అసెట్స్ వివరణ (స్థిరాస్తి):	డిమాండ్ నోటీసు తేదీ మరియు మొత్తం:	స్వాధీనతా తేది:
1.	**ఎపిపి ఐడి మరియు యూని కోడ్: 01749592 మరియు 10600001386 శాఖ పేరు- గుంటూరు** **దీపికా వెలమూరి** ఫ్లాట్ నం.402, బ్లాక్ నం.బి-3వ అంతస్తు, అంజనాద్రీ, డో నం.579, తిరుమల గార్డెన్, పాత గుంటూరు, మానసా సరోవరం పార్క్ వద్ద, నందివెలుగు రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004 **దీపికా వెలమూరి నివాస** చిరునామా: ఫ్లాట్ నం.102, పాములపట్టి హైట్స్, ఠగూర్ స్టాట్యూ ప్రక్కన, డొంక రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 **దీపికా వెలమూరి** ఆఫీస్ చిరునామా: చైతన్యా స్కూల్ ప్రక్కన, లక్ష్మీపురం రోడ్డు, లక్ష్మీపురం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 **కృష్ణా చైతన్యా తదువరి** ఫ్లాట్ నం.102, పాములపట్టి హైట్స్, ఠాగోర్ స్టాట్యూ ప్రక్కన, డొంక రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002	ఫ్లాట్ నం.402, బ్లాక్ బి-3వ అంతస్తు, అంజనాద్రీ, డో నం.579, తిరుమల గార్డెన్స్, పాత గుంటూరు, మానస సరోవరం పార్క్ వద్ద, నందివెలుగు రోడ్డు, గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002, తూర్పు: ఓపెన్ టూ స్కై, పడమర: ఓపెన్ టూ స్కై, ఉత్తరం: కామన్ కారిడార్, దక్షిణం: ఓపెన్ టూ స్కై	26-Jun-23 For Rs.2843675/-	13-Oct-23

ప్రదేశం : గుంటూరు
తేది: 19.10.2023
(ఆధీకృత అధికారి)
పిరమాల్ క్యాపిటల్ మరియు హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)

సెక్యూరిటి ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 (ది యాక్ట్) మరియు ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ లోని సెక్షన్ 13 (2) కింద నోటీసు

వ. సంఖ్య	రుణగ్రహీత(ల) పేరు (ఎ)	తాకట్టు ఆస్తి వివరాలు (బి)	ఎన్‌పిఎ తేదీ (సి)	బకాయివున్న మొత్తం (రూ.) (డి)
1.	రుణ ఖాతా నం. HILAHYM00433807 1. ఘంటా ప్రియాంక అలియాస్ కోనేరు ఘంటా ప్రియాంక (సహ-రుణగ్రహీత, దివంగత కోనేరు శ్రీమహేష్ అలియాస్ శ్రీమహేష్ కోనేరు యొక్క సతీమణి మరియు చట్టబద్ధ వారసురాలు) 2. కోనేరు శిఖర (మైనర్ కుమార్తె మరియు దివంగత కోనేరు శ్రీమహేష్ అలియాస్ శ్రీమహేష్ కోనేరు యొక్క చట్టబద్ధ వారసురాలు, ఆమె యొక్క సహజ గార్డియన్ ఘంటా ప్రియాంక అలియాస్ కోనేరు ఘంటా ప్రియాంక ద్వారా) 3. కోనేరు రాణి (తల్లి మరియు కోనేరు శ్రీమహేష్ అలియాస్ శ్రీమహేష్ కోనేరు యొక్క చట్టబద్ధ వారసురాలు) 4. కోనేరు సాంబశివరావు (తండ్రి మరియు దివంగత కోనేరు శ్రీమహేష్ అలియాస్ శ్రీమహేష్ కోనేరు యొక్క చట్టబద్ధ వారసుడు)	డోర్ నంబరు 54-13/5-10, ఆర్.ఎస్. ప్లాట్ నం. 187, ఆర్.ఎస్. నం. 391/2, పాత అసెస్‌మెంట్ నం. 40656, కొత్త అసెస్‌మెంట్ నం. 276723, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, గుణదల, విజయవాడ, మున్సిపల్ కార్పొరేషన్, కృష్ణా జిల్లా, విజయవాడ-520008, ఆంధ్రప్రదేశ్.	05.12.2021	26.09.2023 నాటికి రూ. 1,55,78,179.77/- (ఒక కోటి యాభై అయిదు లక్షల డెబ్బై ఎనిమిది వేల నూట డెబ్బై తొమ్మిది రూపాయలు మరియు డెబ్బై ఏడు పైసలు మాత్రమే)

పైన పేర్లు ఇవ్వబడిన రుణ గ్రహీత(లు) రుణ ఖాతా(ల)లో ఆర్థిక క్రమశిక్షణను పాటించడంలో విఫలమయ్యారు మరియు కంపెనీ నిర్వహించే మామూలు వ్యాపార నిర్వహణలో తేలిందేమిటంటే నిర్వహించబడే ఖాతాల పుస్తకాల ప్రకారం, బకాయివున్న మొత్తాన్ని కాలమ్ డి సూచిస్తోంది.
రుణ గ్రహీత(లు) అప్పు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో పదేపదే విఫలమవుతున్న కారణంగా, రెగ్యులేటరి అథారిటి జారీచేసిన ఆస్తుల వర్గీకరణకు సంబంధించిన మార్గదర్శకాల లోపల సదరు రుణ ఖాతాను కంపెనీ నిరర్థక ఆస్తిగా వర్గీ కరించడమైనది (కాలమ్ సిలో తేదీ నాటికి ఉన్నట్లుగా). అనంతరం, ప్రతి రుణగ్రహీతకు చట్టంలోని సెక్షన్ 13 (2) ప్రకారం నోటీసులు కూడా జారీచేయడమైనది.
పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుంచి 60 రోజుల లోపల అప్పటి వరకు అయినవడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో సహా, పైన కాలమ్ డి లో సూచించబడిన చెల్లించవలసిన బకాయిలు మొత్తాన్నీ చెల్లించడం ద్వారా కంపెనీ పట్ల ఉన్న అతని/ఆమె బాధ్యతలను పూర్తిగా నెరవేర్చవలసిందిగా పై రుణగ్రహీత(లు)ను కంపెనీ కోరుతోంది, అలా చెల్లించని పక్షంలో, పైన కాలమ్ బిలో తెలియజేసిన తనఖాఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు కంపెనీకి హక్కువుంది మరియు చట్టంలో కంపెనీకి లభించే ఎలాంటి ఇతర చర్యలను కూడా తీసుకుంటుంది.
సర్ఫేయిసి చట్టం సెక్షన్ 13 లోని ఉప-సెక్షన్ (8) నిబంధనల ప్రకారం, ''బహిరంగ వేలం ద్వారా, ప్రజల నుంచి కొటేషన్, టెండర్ పిలవడం ద్వారా లేదా ప్రైవేట్ ట్రీటీ ద్వారా సెక్యూర్డ్ ఆస్తి(ల)ను విక్రయించేందుకు నోటీసు ప్రచురితమైన తేదీ వరకు సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా మాత్రమే అయిన వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు అవుట్‌స్టాండింగ్ బకాయిల పూర్తి మొత్తాన్ని రుణగ్రహీత సమర్పించవచ్చు. పైన తెలియజేసిన చట్టబద్ధంగా ప్రిస్క్రయిబ్ చేసిన కాల వ్యవధి లోపు సెక్యూర్డ్ ఆస్తిని రిడీమ్ చేసుకోవడంలో రుణగ్రహీత విఫలమైతే, ఆస్తిని రిడీమ్ చేసుకునేందుకు రుణగ్రహీతకు హక్కు లేదని కూడా గమనించాలి.''
సర్ఫేయిసి చట్టంలోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (13) నిబంధనల ప్రకారం, సెక్యూర్డ్ క్రెడిటార్ నుంచి ముందుగా రాతపూర్వక సమ్మతి లేకుండా, నోటీసులో ప్రస్తావించిన సెక్యూర్డ్ ఆస్తులు వేటినైనా విక్రయం, లీజు లేదా ఇతరత్రా (తన వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో కాకుండా ఇతరత్రా) బదిలీచేయకుండా మిమ్మల్ని ఇందుమూలంగా నిషేధించడమైనది.

ధనీ లోన్స్ అండ్ సర్వీసెస్ లిమిటెడ్ తరపున
(గతంలో ఐబిఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ మరియు ఇండియాబుల్స్ కన్స్యూమర్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలవబడేది)
స్థలం : విజయవాడ
అధీకృత అధికారి

గాజా ఆసుపత్రి దాడిపై మోడీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : గాజాలోని ఒక ఆసుపత్రిపై జరిగిన దారుణ దాడిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాధారణ పౌరుల మరణాలు చాలా తీవ్రమైన అంశమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. 'గాజాలోని అల్ అహ్లి ఆసుపత్రిలో పెను ప్రాణనష్టం సంభవించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. ప్రస్తుత ఘర్షణల్లో (ఇజ్రాయెల్-హమాస్ పోరును ఉద్దేశిస్తూ) సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత తీవ్రమైన, ఆందోళనకర అంశం. ఇందుకు కారకులకు శిక్ష పడాలి' అని మోడీ ట్వీట్ చేశారు.

విమానం టాయిలెట్స్‌లో 3.2 కిలోల బంగారం..

బెంగళూరు: మాల్దీవులు నుంచి బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ఇండిగో విమానంలో భారీగా బంగారం పట్టుబడింది. విమానం టాయిలెట్స్‌లోని వాష్ బేసిన్‌లో 3.2 కిలోల బంగారాన్ని గుర్తించి అధికారులు సీజ్ చేశారు. అధికారులు సీజ్ చేసిన ఆ బంగారం విలువ సుమారుగా రూ.1.8 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. మాల్దీవులు నుంచి అక్రమంగా బంగారు బిస్కెట్లు తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు విమానం ఎయిర్‌పోర్టులో దిగగానే కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అది గుర్తించిన నిందితులు ఆ బంగారాన్ని టాయిలెట్స్‌లోని వాష్ బేసిన్‌లో పడేశారు. తనిఖీ చేస్తూ వచ్చిన అధికారులకు వాష్‌బేసిన్‌లో ఒక చిన్న సంచి కనిపించింది. దాన్ని తెరచి చూడగా అందులో బంగారం కనిపించింది. దొరికిన బంగారు బిస్కెట్లను సీజ్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

13 మంది న్యాయవాదులను హైకోర్టు జడ్జిలుగా సిఫార్సు

న్యూఢిల్లీ : 13 మంది న్యాయవాదులను వివిధ హైకోర్టు జడ్జిలుగా సుప్రీంకోర్టు కొలీజయం బుధవారం సిఫార్సు చేసింది. న్యాయవాదులు ఎన్ ఉన్ని కృష్ణన్, కౌషిక్ గోస్వామి గౌహతి హైకోర్టు జడ్జిలుగా సిజెఐ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసింది. ఉత్తరఖండ్ హైకోర్టు జడ్జిలుగా న్యాయవాదులు సిద్ధార్థ షా, అలోక్ మహ్రాలను నియమించాలని సిఫార్సు చేసింది. న్యాయవాదులు హర్మీత్ సింగ్ గ్రెవాల్, దీపిందర్ సింగ్ నాల్వా, సుమీత్ గోయిల్, సుదీప్తి శర్మ, కీర్తి సింగ్‌లను పంజాబ్-హర్యానా హైకోర్టులుగా నియమించాలని సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్ హైకోర్టుకు న్యాయవాదులు వినయ్ సరఫ్, వివేక్ జైన్, అశీష్ శ్రోటి, అమిత్ సేథ్‌లను మధ్య ప్రదేశ్ హైకోర్టు జడ్జీలుగా సిఫార్సు చేసింది. సిజెఐ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఈ కొలీజియంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు కూడా సభ్యులుగా ఉన్నారు.

పెన్షన్ సూచికలో పడిపోతున్న భారత్ స్థానం

న్యూఢిల్లీ : ప్రపంచ పెన్షన్ సూచికలో భారత్ స్థానం పడిపోతోంది. 2022 సూచికలో మన దేశం 41వ స్థానంలో (మొత్తం దేశాలు 44) ఉండగా ఈ సంవత్సరం 45వ స్థానానికి (మొత్తం దేశాలు 47) పడిపోయింది. అమెరికాకు చెందిన కన్సల్టెన్సీ కంపెనీ మెర్సర్, మరో సంస్థ సీఎఫ్ఏ ఇన్‌స్టిట్యూట్ ఈ సూచికలను విడుదల చేశాయి. పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ స్థానాలను నిర్ణయించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు లభించే ప్రయోజనాలు వారికి ఏ మేరకు సరిపోతాయి, భవిష్యత్తులో వారి జీవితం ఎలా ఉంటుంది, పెన్షన్ వ్యవస్థపై వారిలో ఉన్న నమ్మకం వంటి విషయాలను గమనంలోకి తీసుకున్నారు. పెన్షన్ ర్యాంకుల్లో నెదర్లాండ్ ప్రథమ స్థానంలో నిలవగా ఐస్‌లాండ్, డెన్మార్క్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే ఈ సూచికలు వాస్తవాన్ని ప్రతిబింబించడం లేదని, అవి అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకోలేదని కేంద్రం పార్లమెంటుకు తెలిపింది.

త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి

న్యూఢిల్లీ: త్రిపుర, ఒడిశా రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు నియమితులయ్యారు. త్రిపుర నూతన గవర్నర్‌గా తెలంగాణకు చెందిన బిజెపి సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి, ఒడిశా గవర్నర్‌గా ఝార్ఖండ్ మాజీ సీఎం రఘుబర్ దాస్‌లను నియమిస్తూ రాష్ట్రపతి కార్యాలయం బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. నల్లు ఇంద్రసేనా రెడ్డి తెలంగాణలోని సూర్యాపేట జిల్లాకు చెందినవారు. ఆయన గతంలో మలక్‌పేట నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి చేరికలు, సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా 2022లో నియమితులైన విషయం తెలిసిందే. ఒడిశా గవర్నర్‌గా నియమితులైన రఘుబర్‌దాస్ ప్రస్తుతం బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. 2014 నుంచి 2019 వరకు ఆయన జార్ఖండ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

మెయితీలు గిరిజనులు కాదు.. క్షత్రియులు

- ఆదివాసీ లక్షణాలు అస్సల్లేవ్ !
- ఇది వరకే రెండు సార్లు ఎస్‌సి హోదా నిరాకరణ
- ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టీకరణ
- సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి

న్యూఢిల్లీ : ప్రస్తుతం మణిపూర్ హింసాకాండతో రగులుతోంది. ఈ హింసాకాండాకు ప్రధానకారణల్లో ఒకటి మెయితీలకు ఎస్‌టి హోదా గురించి అన్న సంగతి తెలిసిందే. మెయితీలకు ఎస్‌టి హోదా సిఫార్సు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా మే 3న జరిగిన ర్యాలీ తరువాత నుంచి మణిపూర్ మండుతోంది. అయితే మెయితీలకు ఎస్‌టి హోదా అనే వివాదం ఈనాటిది కాదు. గత 40 ఏళ్లలో రెండు సార్లు మెయితీలకు ఎస్‌టి హోదా ఇచ్చే ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని తిరస్కరించారు. 1982, 2001 సంవత్సరాల్లో ఈ విధంగా జరిగింది. ప్రభుత్వ రికార్డులే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. మెయితీలకు గిరిజన లక్షణాలు లేవని, పైగా మెయితీలు హిందువుల్లో ఉన్నత కులంగా భావించే క్షత్రియ కులాన్ని స్వీకరించారనే కారణాలతో వీరికి ఎస్‌టి హోదాను తిరస్కరించారు.

ముందుగా 1982లో మెయితీలను ఎస్‌టిల్లో చేర్చాలని కేంద్ర హోం శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జిఐ) కార్యాలయం పరిశీలించింది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మెయితీలకు గిరిజన లక్షణాలు లేవని, మణిపూర్ లోయలో నివసించే గిరిజనేతర ప్రజల్ని సూచించడానికే మెయితీలు అనే పదాన్ని ఉపయోగిస్తారని ఆర్‌జిఐ కార్యాలయం స్పష్టం చేసింది. వీరికి ఎస్‌టి హోదాను తిరస్కరించింది.

దీని తరువాత 20 ఏళ్ల తరువాత అంటే 2001లో కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి జాబితాను సవరిస్తున్న సందర్భంలో మెయితీలను ఎస్‌టిల్లో చేర్చే విషయంలో అప్పటి మణిపూర్ ప్రభుత్వం నుంచి సిఫార్సులు ఆహ్వానించింది. దీనికి మణిపూర్ గిరిజన అభివృద్ధి శాఖ సమాధానం ఇస్తూ 'మెయితీలకు ఎస్‌టి హోదాపై 1982లో ఆర్‌జిఐ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు' కేంద్రానికి తెలిపింది. మెయితీలను ఎస్‌టి జాబితాలో చేర్చాల్సిన అవసరం లేదని, పైగా వీరు హిందూ కులాల నిచ్చెనలో క్షత్రియ కుల హోదాన్ని స్వీకరించారని మణిపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

కాగా, మెయితీలకు రెండు సార్లు ఎస్‌టి హోదాను తిరస్కరించిన విషయాన్ని ఇటీవల మణిపూర్ హైకోర్టు విచారణ సమయంలో కోర్టు ముందు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించలేదు. నిజం చెప్పాలంటే హైకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత అంటే ఈ ఏడాది ఏప్రిల్ చివరిలో ఈ పత్రాలను అధికారులు వెలికితీశారు.

నలుగురు కొత్త జడ్జీలు రేపు ప్రమాణం

దేశవ్యాప్తంగా 16 మంది బదిలీ

దేశ వ్యాప్తంగా వివిధ హైకోర్టులకు 17 మంది న్యాయమూర్తులను, అదనపు న్యాయమూర్తులు నియమకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. వారిలో నలుగురు ఎపి హైకోర్టుకు నియమితులైన వారున్నారు. దేశ వ్యాప్తంగా 16 మంది హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేయగా, వీరిలో ఇద్దరు ఎపి హైకోర్టు, మరో ఇద్దరు తెలంగాణ హైకోర్టు నుంచి ఉన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్రజీ ఎపి హైకోర్టుకు బదిలీ అయ్యారు.

ప్రజాశక్తి-అమరావతి

ఎపి హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు జడ్జీలు శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. దేశంలోని వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు 16 మందిని బదిలీ చేస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎపి, తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తులు ఇద్దరు చొప్పున ఉన్నారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ మెఘవాల్ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి మానవేంద్రనాథ్ రాయ్ గుజరాత్, అదనపు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అదేవిధంగా తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ మున్నూరి లక్ష్మణ్, జస్టిస్ జి అనుపమ చక్రవర్తిని రాజస్థాన్, పాట్నా హైకోర్టులకు బదిలీ అయ్యారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్రజీ ఎపి హైకోర్టుకు బదిలీ అయ్యారు.

న్యాయవాదుల కోటా నుంచి హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి కనపర్తి, సుమతి జగడం, న్యాపతి విజయ్ ఎపి హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితు లయ్యారు. వీరితో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఈ నెల 10న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియం చేసిన సిఫార్సుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో వీరి నియామకానికి సంబంధించి బుధవారం కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తవారి నియామకంతో న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరనుంది.

హరినాథ్ నూనెపల్లి

ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాతకోట గ్రామంలో బాల వెంకటరెడ్డి, కృష్ణవేణి దంపతులకు 1972 జనవరి 12న నూనెపల్లి హరినాథ్ జన్మించారు. ఏలూరు సిఆర్‌ఆర్ కాలేజీలో లా, హైదరాబాద్ ఒయులో ఎల్‌ఎల్‌ఎం చేశారు. సీనియర్ న్యాయవాది ఎస్ రవి వద్ద జూనియర్‌గా చేశారు. తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ చేపట్టి వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా చేశారు. ఇప్పుడు హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా చేస్తున్నారు.

కిరణ్మయి మండవ

కృష్ణా జిల్లా కూచిపూడిలో మండల రామలింగేశ్వరరావు, ఝాన్సీకి 1970 జులై 30న మండల కిరణ్మయి జన్మించారు. ఒయు నుంచి లా చేశాక 1994లో ఎన్‌రోల్ అయ్యారు. జెవి ప్రసాద్ వద్ద జూనియర్‌గా చేశారు. వివిధ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా చేశారు. 14 ఏళ్లపాటు ఐటి శాఖకు కౌన్సిల్‌గా చేశారు.

సుమతి జగడం

కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం పండువారిపేటలో 1971 జూన్ 28న జగడం జానకి, లక్ష్మీపతి దంపతులకు సుమతి జన్మించారు. ఒయులో బిఎ, ఆంధ్ర మహిళా సభ లా కాలేజీలో లా చేశారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. బొజ్జా తారకం వద్ద జూనియర్‌గా చేశారు. 2020 నుంచి ఎపి ప్రభుత్వ ప్లీడర్‌గా హైకోర్టులో చేస్తున్నారు.

న్యాపతి విజయ్

రాజమండ్రిలో 1974 ఆగస్టు 8న న్యాపతి సుబ్బారావు, ప్రమీకు విజయ్ జన్మించారు. ఎయు నుంచి 1997లో లా చేశాక ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎంఎస్ రామచంద్రరావు (ఇప్పుడు హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సిజె) సీనియర్ న్యాయవాదిగా చేసేప్పుడు ఆయన వద్ద జూనియర్‌గా చేశారు. అన్ని రకాల కేసులను వాదించిన అనుభవం ఉంది.

గాజా ఆస్పత్రిపై దాడికి పలు దేశాల ఖండన

గాజా : గాజా ఆస్పత్రిపై బాంబు దాడిని ఇరాన్, ఇరాక్, ఈజిప్టు, జోర్డాన్, ట్యునీసియాతో సహా పలు దేశాలు ఖండించాయి. మంగళవారం నాటి దాడిలో వందలాదిమంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. గాయపడిన వారితో, రోగులతో కిక్కిరిసి వున్న ఈ ఆస్పత్రిపై దాడి అత్యంత హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. గాజాలోని అల్ అహ్లి ఆస్పత్రిపై దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇజ్రాయిల్ క్రూరత్వాన్ని తెలియజేస్తున్నాయి. ఆస్పత్రిలోని హాల్స్ అన్నింటికీ మంటలు వ్యాపించాయి. ఎక్కడికక్కడ పగిలిన గాజు ముక్కలు, చెల్లా చెదురుగా పడిన మృత దేహాలతో ఆ ప్రాంతమంతా బీభత్సంగా వుంది. ఈ దాడిలో 500మంది మరణించారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ గాజా ప్రాంతాన్ని వీడాల్సిందిగా ప్రజలను ఇజ్రాయిల్ ఆదేశించిన నేపథ్యంలో గాజా నగరంలోని పలు ఆస్పత్రులు వందలాదిమంది శరణార్థులతో నిండిపోయాయి.

అయితే ఆస్పత్రి మరణాలపై ఇంకా వివరాలు అందాల్సి వుందని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి తెలిపారు. 'వివరాలు అందిన వెంటనే ప్రజలకు అన్ని విషయాలు తెలియచేస్తాం. ఇది ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడి అని చెప్పలేం." అని ఆయన అన్నారు. మరోవైపు దక్షిణ గాజాలో దాడులు కొనసాగుతునే వున్నాయి. అమాయక పౌరులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. మానవతా సాయం అందేందుకు కారిడార్లు తెరవాల్సిందిగా ఇజ్రాయిల్‌ను ఒప్పించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. గత వారం రోజుల దాడుల్లో ఐక్యరాజ్య సమితికి చెందిన 24 లక్ష్యాలపై దాడులు జరిగాయి. 14మంది ఐరాస సిబ్బంది మరణించారు. ఇప్పటికి 10లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు తమ ఇళ్ళను వీడి వెళ్ళిపోయారు. గాజాలో మిగిలిన సగానికిపైగా జనాభా కేవలం 14కిలోమీటర్ల ప్రాంతంలో వున్నారని ఐక్యరాజ్య సమితి పేర్కొంది.

యూరోపియన్ నేతలూ ..

గాజాలో ఆస్పతిపై దాడి యురోపియన్ నేతలు తీవ్రంగా ఖండించారు. పలువురు పాలస్తీనియన్ల మృతికి కారణమైన గాజా ఆస్పత్రిపై దాడిని ఫ్రాన్స్ ఖండించింది. ఈ మేరకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఆస్పత్రిపై దాడిని ఏ రకంగానూ సమర్థించలేమన్నారు. గాజాలోకి మానవతా సాయం వెళ్లేందుకు అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇయు ఉన్నత దౌత్యవేత్త జోసెఫ్ బోరెల్ మాట్లాడుతూ, ఈ నేరానికి కారకులెవరో నిర్ధారించాలన్నారు. మరోసారి అమాయకులు అత్యున్నత మూల్యం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఫోటోలు చూసి దిగ్భ్రాంతి చెందానని జర్మనీ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జ్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనకుర సంబంధించిన వాస్తవాలు వెలికి రావాలని, అది చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లేవర్లీ మాట్లాడుతూ, ఈ దాడికి ఇజ్రాయిల్ కారణమని తాము భావించడం లేదన్నారు. అయితే వాస్తవాలు నిర్ధారించబడే వరకు ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడం అన్నింటికంటే ముఖ్యమన్నారు.

తక్షణమే కాల్పుల విరమణ పాటించండి

- అరబ్ దేశాల డిమాండ్

ఐక్యరాజ్యసమితి : గాజా ఆస్పత్రిపై జరిగిన బాంబు దాడిలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై 22 అరబ్ దేశాలు స్పందించాయి. గాజాలో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేశాయి. ఈ ఊచకోత ఘటనపై అరబ్ దేశాలు ఆగ్రహంతో ఉన్నాయని ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ తెలిపారు. గాజా నుండి పాలస్తీనా ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలని, ప్రజలకు వెంటనే మానవతా సాయం అందించాలని అరబ్ దేశాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయని ఆయన చెప్పారు. ఊచకోత ఘటన నేపథ్యంలో ప్రజల ప్రాణాలు కాపాడడానికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకే కాల్పుల విరమణ పాటించాలని కోరుతున్నామని అన్నారు. ఈ దాడికి ఇజ్రాయిలే కారణమని సిరియా, సౌదీ అరేబియా ఆరోపించాయి. ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌లో యుద్ధ నేరాలకు, మారణహోమానికి పాల్పడుతోందని లిబియా విదేశాంగ శాఖ మండిపడింది. ఇరాక్ మూడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించింది. లెబనాన్‌లో నిరసన ప్రదర్శనలు హోరెత్తాయి. ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగా ఆస్పత్రిపై బాంబు దాడి జరిపిందని, ఇది అంతర్జాతీయ మానవతావాద చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్-ఫతా అల్-సిసీ విమర్శించారు.

మారణకాండను ఆపండి !

- ప్రపంచ దేశాలకు పాలస్తీనా విజ్ఞప్తి

జెరూసలెం : తమ ప్రజలపై ఇజ్రాయిల్ ఉద్దేశ్యపూర్వకంగా సాగిస్తున్న ఊచకోతను ఆపాలని పాలస్తీనా ఉన్నతాధికారులు ప్రపంచ నేతలను కోరారు. గాజా ఆస్పత్రిపై దాడిని సున్నితంగా ఆలోచించేవారు, నైతిక విలువలు కలిగినవారెవరూ సహించరని అన్నారు. జరిగింది మారణకాండే అందులో ఎలాంటి సందేహం లేదని పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌కు సీనియర్ సలహాదారుడు హుస్సేన్ అల్ షేక్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఈ మారణకాండను నిలువరించేందుకు అంతర్జాతీయ సమాజం రంగంలోకి దిగాలని కోరుతున్నాం. మౌనం, పక్షపాతం ఇక ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు' అని ఆయన పేర్కొన్నారు. ఆస్పత్రిపై దాడి జరిగిన తీరు భయానకంగా వుందని పాలస్తీనా ఆరోగ్య మంత్రి మాయి అల్ కైలా వ్యాఖ్యానించారు. 'దిగ్బంధనం విధించడం ద్వారా అన్ని మానవతా విలువలను, చట్టాలను ఇజ్రాయిల్ అతిక్రమించింది. ఆసుపత్రులను ధ్వంసం చేస్తున్నారు., శరణార్థులు తలదాచుకుంటున్న శిబిరాలపైనా దాడులు చేస్తున్నారని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా జరిపే ఈ దాడుల నుండి తమను కాపాడాలంటూ ఐక్యరాజ్య సమితితో సహా అన్ని సంస్థలకు, ప్రపంచ దేశాలకు వారు విజ్ఞప్తి చేశారు.

ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా

వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలెంల్లో సమ్మె

జెరూసలేం : గాజా ఆస్పత్రిపై ఇజ్రాయిల్ బాంబు దాడులను నిరసిస్తూ వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంల్లో బుధవారం సమ్మె జరిగింది. వ్యాపార వాణిజ్య సంస్థలు, పాఠశాలలు, కార్యాలయాలు అన్నీ మూతపడ్డాయి. వెస్ట్ బ్యాంక్ గవర్నరేట్స్‌కు కూడా ఈ సమ్మె వ్యాపించింది. రమల్లా, తుల్కారెమ్, హెబ్రాన్, క్వాల్‌కిలా, నబ్లస్ వంటి నగరాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ఆస్పత్రిపై దాడిని ఖండించారు. ఈ దాడిలో ప్రధానంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. తూర్పు జెరూసలేంలో దుకాణాలు కూడా మూతపడ్డాయి. హెబ్రాన్ వంటి నగరాల్లో హమాస్ పతాకాలతో నిరసన ప్రదర్శకులు వందలాదిమంది ప్రదర్శనలు నిర్వహించడం వీడియోల్లో కనబడుతోంది.

జర్నలిస్టు సౌమ్య విశ్వనాథన్ హత్య కేసు

- తీర్పు వెల్లడించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో 15 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ప్రముఖ జర్నలిస్టు సౌమ్య విశ్వనాథన్ హత్య కేసులో ఢిల్లీ కోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితుల్ని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. నలుగురు నిందితులు రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్‌ను హత్య, దోపిడీ అభియోగాల కింద దోషులుగా నిర్ధారించగా.. వారికి సాయం చేసిన అభియోగాలపై అజయ్ సేఠిని దోషిగా ప్రకటించింది. వీరికి త్వరలోనే శిక్ష ఖరారు చేయనుంది. ఓ టీవీ ఛానల్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్న సౌమ్య విశ్వనాథన్ 2008 సెప్టెంబరు 30వ తేదీ తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఆమె ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తుండగా.. వసంత్ విహార్ ప్రాంతంలో ఆమె కారును నిందితులు అడ్డగించి దోపిడీకి యత్నించారు. అనంతరం ఆమెపై కాల్పులు జరిపి పరారయ్యారు. ఉదయానికి కారులో ఆమె మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పట్లో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. తొలుత ఆమె రోడ్డు ప్రమాదంలో మరణించి ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. అయితే పోస్టుమార్టం రిపోర్ట్‌లో ఆమె తలకు బుల్లెట్ గాయమైనట్లు తేలడంతో హత్యగా నిర్ధారించారు. అనంతరం సీసీటీవీ దశ్యాలను పరిశీలించగా.. ఆమె కారును మరో వాహనం అనుసరించినట్లు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు 2009లో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దోపిడీ కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. అప్పటి నుంచి దీనిపై సుదీర్ఘ విచారణ జరిపి తాజాగా ఢిల్లీ కోర్టు తీర్పు ఇచ్చింది

స్వేచ్ఛ అంతరిస్తోంది

- న్యూస్‌క్లిక్ ఉదంతంపై కేరళ సెమినార్‌లో వక్తలు

తిరువనంతపురం : రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛా హక్కు అంతరించిపోతోందని పలువురు పాత్రికేయులు ఆందోళన వ్యక్తం చేశారు. 'భారత్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛ' అనే అంశంపై తిరువనంతపురంలో జరిగిన సెమినార్‌లో సీనియర్ పాత్రికేయులు ప్రసంగిస్తూ మీడియా గొంతు నొక్కేందుకు ఉపా చట్టాన్ని, వలసవాదుల కాలం నాటి రాజద్రోహ చట్టాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. మీడియాలో భయాన్ని, అభద్రతాభావాన్ని వ్యాప్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన అధీనంలోని దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తోందని వారు ఆరోపించారు.

'ది వైర్' వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్ సెమినార్‌ను ప్రారంభిస్తూ న్యూస్‌క్లిక్ పోర్టల్‌పై ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులను ఖండించారు. అత్యవసర పరిస్థితి కాలంలో కంటే ఇప్పుడు పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని ఆయన విమర్శించారు. ఉపా కింద అరెస్టయిన విద్యార్థులు, పాత్రికేయులు బెయిల్ రాక సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రశ్నార్థకమైందని, పాత్రికేయులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సెమినార్‌లో సీనియర్ పాత్రికేయులు కేజే జాకబ్, జి.రాధాకృష్ణన్, రాష్ట్ర మాజీ మంత్రి థామస్ ఐజాక్ తదితరులు ప్రసంగించారు.

ఎన్‌ఎంసి నిబంధనలు సడలించండి

- కొత్త నిబంధనల వల్ల ఎపికి అన్యాయం
- కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయకు రాష్ట్ర మంత్రి విడదల రజిని విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసి) కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం వాటిల్లుతోందని, వాటిని సడలించి పాత పద్ధతి కొనసాగించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్సూక్ మాండవీయను మంత్రి విడదల రజిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రతి రాష్ట్రంలో ప్రతి పది లక్షల మంది జనాభాకు వంద సీట్లు చొప్పున మాత్రమే అనుమతి ఇచ్చేలా కొత్త నిబంధనలు తీసుకొచ్చిందని తెలిపారు. కొత్త మెడికల్ కళాశాలలకు అనుమతి ఇవ్వాలంటే 605 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి కూడా ఉండాలని ఎన్‌ఎంసి తాజాగా నిర్ణయించిందని చెప్పారు. ఈ రెండు నిబంధనల వల్ల కొత్తగా ఏర్పడిన తమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. రాష్ట్రం విభజన తరువాత టెర్షియరి కేర్ సర్వీసెస్ విషయంలో ఏపీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాష్ట్రంలో రూ. 8,480 కోట్లతో 17 కొత్త మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నామని, వీటిలో ఇప్పటికే ఐదు మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. మిగిలిన 12 కళాశాలల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

తెలంగాణలో బిజెపి అడ్రస్ గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపిందని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. కెసిఆర్‌పై అవినీతి ఆరోపణలున్నా సిబిఐ, ఇడి, ఐటి, ఇతర విచారణ సంస్థలకు అవి కనిపించవనీ..ఇదే బిఆర్‌ఎస్, బిజెపి మిలాఖత్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. బుధవారం వరంగల్ వచ్చిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రామప్ప ఆలయాన్ని అగ్రనేతలతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ కార్డులకు పూజలు నిర్వహించారు. అనంతరం రామప్ప ఆలయం నుంచి కాంగ్రెస్ విజయభేరి యాత్రను రాహుల్, ప్రియాంక గాంధీ ప్రారంభించారు. అనంతరం ములుగులో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. 'కెసిఆర్ గతంలో ఎన్నో హామీలు ఇచ్చారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్నారు.. ఇచ్చారా? ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు.. ఇచ్చారా? డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామన్నారు.. ఎంత మందికి ఇచ్చారు. లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామన్నారు.. ఎంత మందికి చేశారు? కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలన్నీ మేం నెరవేర్చాం. ఇచ్చిన మాటను కాంగ్రెస్ తప్పకుండా నిలబెట్టుకుంటుంది. దొరల తెలంగాణ.. ప్రజల తెలంగాణ మధ్య ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజల పక్షంగా ఉన్న కాంగ్రెస్‌కి మద్దతివ్వాలి' అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా ప్రజల ఆకాంక్షలకే విలువ ఇచ్చిందని అన్నారు. రాజకీయంగా నష్టమని తెలిసినా.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని చెప్పారు. ' తెలంగాణ ప్రజల ఆశలు,ఆకాంక్షలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. నెహ్రూ, ఇందిరా, రాజీవ్‌గాంధీ ఎప్పుడూ ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల గురించే ఆలోచించేవారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే రాష్ట్రానికి ఎన్నో జాతీయ సంస్థలు ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఒక రోడ్ మ్యాప్ రూపొందించింది. మీ ఆశలు, ఆశయాలు నెరవేరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి' అని ప్రియాంక గాంధీ అన్నారు. సభలో తెలంగాణ ఇన్‌ఛార్జ్ మాణిక్ రావు ఠాక్రే, పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే సీతక్క, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులు, ఇన్నర్ రింగ్‌రోడ్డుపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను తిప్పి కొడుతూ తాము ఇప్పటికే ప్రజల ముందు ఉంచిన వాస్తవాలను గవర్నరుకు అందించామని చెప్పారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు, కోర్టులో జరుగుతున్న విచారణ అంతా తనకు తెలుసునని గవర్నరు తమతో చెప్పారని తెలిపారు. గవర్నరును కలిసిన వారిలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, వర్ల రామయ్య, బోండా ఉమామహేశ్వరరావు, ఎంఎ షరీఫ్, ఎమ్మెల్సీలు అనురాధ, అశోక్‌బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

మీకోసం

వెల్లుల్లిని బాగా నూరి గంటకోసారి వాసన పీలుస్తూ ఉంటే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

భయంతో ఏ పనిచేసినా విజయాన్ని సాధించలేము.. వివేకంతో చేసే పని సత్ఫలితాన్నిస్తుంది.

ఐకమత్యమే బలం

తలకోన అడవిలోకి 'ద్వైతం' అనే కాకి కొత్తగా వచ్చింది. అప్పటికే అక్కడ నివాసం వున్న కాకులు ద్వైతాన్ని పలకరించాలని చూశాయి. కానీ 'ద్వైతం' ఎవరితోనూ మాట్లాడలేదు. కొన్ని కాకులు 'కొత్త కదా' అంటే, మరికొన్ని 'పొగరు' అన్నాయి. అయినా 'ద్వైతం' ఇవేమీ పట్టించుకోకుండా తన పనిలో తాను వుండేది. ఉదయమే ఆహారానికి పోవడం రాత్రికి తిరిగి వచ్చి గూడులో ఒంటరిగా నివాసం వుండడం దాని దినచర్య. మిగిలిన కాకులన్నీ సాయంత్రం అయితే చాలు ఒక చోట చేరి ఆ రోజు చూసిన వింతలు, తిన్న తిండి గురించి మాట్లాడుకుంటూ సందడిగా ఉండేవి. ఈ సమావేశాలకు ఒక్కరోజు కూడా ద్వైతం రాలేదు.

ఒకరోజు ఒక పెద్ద కాకి ద్వైతాన్ని పిలిచి 'నువ్వు అందరితో కలిసి వుండొచ్చుగా... ఇలా ఒంటరిగా ఉండడం దేనికి?" అంది.

'నాకిలాగే ఇష్టం..' అంది "ద్వైతం'.

ఇక దానితో మాట్లాడి ప్రయోజనం లేదు అనుకుంటూ ఎగిరి పోయింది పెద్ద కాకి. మిగిలిన కాకులన్నీ ఎక్కడ ఆహారం కనిపించినా అందరినీ పిలిచి, కలిసి తినేవి. ద్వైతం మాత్రం ఎక్కువ ఆహారం వున్నా కూడా మిగతా వాటికి చెప్పేది కాదు. ఒకరోజు చెట్టు కొమ్మ పడి 'ద్వైతం' కాలికి, రెక్కకి దెబ్బ తగిలింది. లేవలేని పరిస్థితి వచ్చింది. అటు వైపుగా పోతున్న పిల్ల కాకి దాన్ని చూసి దగ్గరకు రాకుండా వెళ్ళి పోయింది. మరో కాకి కూడా అలాగే చేసింది.

'నేను ఎప్పుడూ వాళ్ళతో మాట్లాడ లేదు. వాళ్ళు నా దగ్గరకు ఎందుకు వస్తారు' అనుకుంది 'ద్వైతం' మనసులో. కానీ కొద్ది సేపటికే చాలా కాకులు ఎగురుకుంటూ దాని దగ్గరకు వచ్చాయి. 'మనవాళ్ళని తీసుకు రావాలనే మేము నీ దగ్గరకు రాలేదు' అంది పిల్ల కాకి. కాకుల గుంపులో కొంచెం వైద్యం తెలిసిన కాకి ద్వైతానికి చికిత్స చేసి, కాలుకి కట్టుకట్టింది. కాకులన్నీ తనపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతగా ద్వైతానికి కన్నీళ్లు కారాయి. 'చూడు ద్వైతం నువ్వు ఇంతలా బాధపడనవసరం లేదు. మన జాతి ఐకమత్యానికి పెట్టింది పేరు. ఎవరికి ఆపద వచ్చినా అందరం కూడి ధైర్యం చెపుతాం. ఒకరికి ఆహారం దొరికినా మిగిలిన వాళ్ళని పిలిచి పంచు కుంటాం. కనుక మనం అంతా ఒకటిగా కలిసి వుండాలి' అంది ఓ ముసలి కాకి. 'నన్ను క్షమించండి ఇకపై అందరితో కలిసి వుంటా' అంది ద్వైతం అందరి వంక చూస్తూ.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసిన బొమ్మ



జగత్ సింహ రెడ్డి,
9వ తరగతి,
భాష్యం స్కూలు,
పులివెందుల,
వైఎస్సార్ కడప జిల్లా.



టైం చెప్పండి

పిల్లలూ, పైన ఇచ్చిన గడియారాల్లో టైం ఎంత అయ్యిందో లెక్కేసి బాక్సుల్లో రాయండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నా కూతురు నా ఇంటి గౌరవం

నేటి సమాజంలో ఆడపిల్ల నెత్తిమీద కుంపటి అనుకునేవాళ్లు ఉన్నట్లుగానే.. కూతురు పుట్టిందని సంబరాలు చేసుకునేవాళ్లు కూడా చాలామంది ఉన్నారు. ఎంతో గారాబంగా పెంచి, పెద్ద చేస్తారు. చదివిస్తారు. పెళ్లీడు వచ్చాక అంగరంగ వైభవంగా పెళ్లి చేస్తారు. ఇక అక్కడితో కూతురు బాధ్యత తీరినట్లు భావిస్తారు. అత్తింట్లో తను ఎన్ని బాధలు పడ్డా పట్టించుకోరు. ఎన్ని కష్టాలు వచ్చినా, బాధలు పడ్డా, భర్త తాగుబోతు అయినా, తిరుగుబోతు అయినా, హింసలు పెడుతున్నా, అత్తింటి గడప దాటకూడదని, భర్త అడుగుజాడల్లో నడవమని, మంచి మాటలతో అతన్ని మార్చుకోమని నచ్చచెబుతారు. పరువు పోయే పనులు చేయొద్దని ఉపదేశిస్తారు. తల్లిదండ్రుల్లో కనిపించే ఈ ధోరణి వల్లే ఎంతోమంది ఆడపిల్లలు వేధింపులు తాళలేక తనువులు చాలిస్తున్నారు. వరకట్న వేధింపుల వల్ల అశువులు బాస్తున్న వనితలెందరో..!

అయితే తన కూతురికి ఆ కష్టం రాకూడదని ఓ తండ్రి భావించాడు. అత్తింట్లో తనకెదురైన చేదు అనుభవాలను నాన్నతో చెప్పుకున్న ఆమెకు ఆ తండ్రి కొండంత భరోసా ఇచ్చాడు. హింసిస్తున్న భర్త నుండి విడాకులు కోరిన కూతురిని పుట్టింటికి తీసుకువచ్చాడు. ఇక్కడే అతను ఈ సమాజానికి గొప్ప సందేశం ఇచ్చాడు. పెళ్లినాడు పుట్టింటి నుండి అత్తింటికి ఆమెను ఎంత సంబరంగా పంపించాడో.. ఇప్పుడు కూడా మేళతాళాలతో.. భాజాభజంత్రీలతో, టపాసులు పేలుస్తూ.. పుట్టింటికి తీసుకువచ్చాడు.

'నా కూతురు నా ఇంటి గౌరవం. ఆమెను తక్కువ చేసి చూసిన ఆ ఇంటి నుండి నా గౌరవాన్ని కాపాడుకున్నాను. చాలామంది తల్లిదండ్రులు భర్తతో విభేదించిన కూతురును గుండెల మీద కుంపటిలా భావిస్తారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురైనా సరే అత్తింట్లో ఆరళ్ల పడాల్సిందేనన్నట్లు చెబుతారు. వారందరికీ నేను ఒక్కటే చెప్పదలచుకున్నాను. కూతురి ప్రతి కష్టంలోనూ మీరు తోడుండాలి. చదువు, పెళ్లితోనే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదు. అత్తింట్లో ఆ పిల్ల బాగోగులు పట్టించుకోవాలి. అక్కడ ఏవైనా ప్రతికూల పరిస్థితులు ఎదురైతే మేమున్నామంటూ ధైర్యం చెప్పాలి' అంటున్నాడు ఆ తండ్రి.



జార్ఖండ్ రాష్ట్రం, రాంచీ, కైలాష్ నగర్ కుమ్‌హార్ తోలీ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రేమ్ గుప్తా అనే వ్యక్తి తన కూతురు సాక్షి గుప్తాకు గతేడాది సచిన్ గుప్తాకి ఇచ్చి అంగరంగ వైభవంగా పెళ్లి చేశారు. అయితే పెళ్లయి అత్తింటికి వెళ్లినప్పటి నుండి సాక్షికి వేధింపులు మొదలయ్యాయి. ఆమె భర్తకి అప్పటికే వివాహమైందని సాక్షికి అర్థమైంది. అయినా అతనితో కలిసుండాలనే నిర్ణయించుకుంది. కానీ రోజురోజుకూ భర్త వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ విషయం తండ్రితో చెప్పింది. భర్తతో కలిసి ఉండలేనని, విడాకులు ఇస్తానని బోరున ఏడ్చింది. కూతురు కష్టం చూసిన ఆ తండ్రి ఆగమేఘాల మీద అక్కడికి చేరుకున్నాడు. ఆమె పరిస్థితి చూసి చలించిపోయాడు. బాధలో ఉన్న ఆమెకు ధైర్యం చెప్పాడు. ఆమె తనకు ఎంత విలువైనదో చాటిచెప్పేలా, ఆ ఇంటి నుండి అమిత గౌరవంగా తన ఇంటికి తీసుకువచ్చాడు. అక్టోబరు 15న జరిగిన ఈ మొత్తం వేడుకను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

'మీరు గారాబంగా పెంచుకున్న మీ కూతురికి అత్తింట్లో అనుకోని పరిస్థితులు ఎదురైతే ఆమెను దూషించకండి. పరువు పోతుందని, అక్కడే ఉండిపొమ్మని బతిమాలకండి. కుమార్తెలు చాలా విలువైనవాళ్లు వాళ్లను కాపాడుకోవాలి' అంటూ గొప్ప మాటలు రాశాడు. పోస్టు చేసిన కొన్ని గంటల్లోనే ఈ వీడియో తెగ వైరల్ అయ్యింది. ప్రేమ్ గుప్తా సమాజానికి గొప్ప సందేశం ఇచ్చారని ఎంతోమంది ఆయనను అభినందిస్తున్నారు.

కరివేపాకు తేనీరు

వంటల్లో కరివేపాకును వేయడం వల్ల వంటల రుచి, వాసన పెరగడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని మనకు తెలుసు. అయితే ఈ కరివేపాకును వంటల్లో వేయడానికి బదులుగా కరివేపాకు నీటిని తాగడం వల్ల మన ఆరోగ్యానికి మరింత మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

తయారీ ఇలా : కొన్ని తాజా కరివేపాకులను తీసుకొని నీటిలో వేసి రాత్రంతా అలాగే ఉంచాలి. ఉదయాన్నే ఈ నీటిని మరిగించి వడకట్టి తాగాలి. ఇలా కరివేపాకు నీటిని తయారు చేసుకుని తాగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి.

- శరీరంలో మలినాలు, విష పదార్థాలు తొలగిపోతాయి. శరీరం శుభ్రపడుతుంది.
- శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కరివేపాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి.
- గుండె సంబంధిత సమస్యలు దరి చేరకుండా ఉంటాయి.
- కరివేపాకు నీటిని తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.
- అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. ప్రేగు కదలికలు చురుకుగా ఉంటాయి.
- ఒత్తిడి తగ్గుతుంది. కండరాలకు, నరాలకు విశ్రాంతి లభిస్తుంది. వెంట్రుకలు కూడా బాగా పెరుగుతాయి.

సెమీస్ దిశగా భారత్

నేడు బంగ్లాదేశ్‌తో నిర్ణయాత్మక మ్యాచ్

పూణే: హ్యాట్రిక్ విజయాలతో దూసు కెళ్తోన్న టీమిండియా.. మరో రసవత్తర పోరుకు సిద్ధమైంది. గురువారం మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగే నాల్గో మ్యాచ్‌లోనూ గెలిస్తే భారత్ వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు చేరువ కానుంది. ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లపై నెగ్గిన టీమిండియా.. 6పాయింట్లతో 2వ స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టు ఆఫ్ఘన్‌పై గెలిచి న్యూజిలాండ్, ఇంగ్లండ్ చేతుల్లో ఓడింది. ఆ జట్టు సెమీస్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. టైటిల్ ఫేవరేట్ జట్లయిన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ రెండు మ్యాచుల్లో నెగ్గి, మూడో మ్యాచ్‌లో పసికూన చేతిలో ఓడాయి.

ప్రేక్షకుల ప్రవర్తనపై చర్యల్లేవు: ఐసిసి

అహ్మదాబాద్‌లో పాకిస్తాన్‌తో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ప్రేక్షకుల ప్రవర్తనపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని ఐసిసి తాజాగా వెల్లడించింది. భారీ జన సందోహం మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో ప్రేక్షకులు అతిగా ప్రవర్తించారంటూ పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిబిసి) ఐసిసికి ఫిర్యాదు చేసింది. దీంతో ఐసిసి ఇది వివక్ష వ్యతిరేక కోడ్ క్రిందకు తేల్చింది.

భారత్(అంచనా): రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లీ, శ్రేయస్, కెఎల్ రాహుల్, జడేజా, హార్దిక్/షమీ, శార్దూల్, కుల్దీప్, బుమ్రా/షమీ, సిరాజ్.

ఓటమి ఎరుగని కివీస్

- **ఆఫ్ఘనిస్తాన్‌పై 149పరుగుల తేడాతో ఘన విజయం**
- **వరుసగా నాల్గో మ్యాచ్‌లోనూ గెలుపుతో టాప్‌లోకి..**

చెన్నై: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ హవా కొనసాగుతోంది. చెపాక్ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో బుధవారం జరిగిన నాల్గో లీగ్ మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ జట్టు 149 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 288 పరుగులు చేయగా.. ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 34.4ఓవర్లలో 139పరుగులకే కుప్పకూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను తొలుత ఆఫ్ఘన్ బౌలర్లు కట్టడి చేశారు. దీంతో కివీస్ 110పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ లాథమ్(68), ఫిలిప్స్(71) కలిసి 5వ వికెట్‌కు 144పరుగులు జతచేశారు. ఓపెనర్ యంగ్ విల్ యంగ్ 64 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులతో 54 పరుగులతో మెరవగా.. టామ్ లాథమ్ 74 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 68 పరుగులు, గ్లెన్ ఫిలిప్స్ 80 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 71 పరుగులు చేశారు. తొలుత రచిన్ రవీంద్ర(32).. చివర్లో మార్క్ చాప్మన్(25నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఆఫ్ఘన్ బౌలర్లలో నవీనుల్ హక్, అజ్మతుల్లాకు రెండేసి, ముజీబుర్ రెహ్మాన్, రషీద్ ఖాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఆఫ్ఘన్ ఓపెనర్లు గుర్బాజ్(11), జద్రాన్(14) నిరాశపరచగా.. రామత్ షా(36), అజ్మతుల్లా(27) ఫర్వాలేదనిపించారు. ఆఫ్ఘన్ జట్టు 107పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి పటిష్టంగా ఉన్నా.. ఆ తర్వాత 32పరుగుల వ్యత్యాసంలో మిగిలిన ఐదు వికెట్లను కోల్పోయింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో ఆఫ్ఘన్ పరాజయంపాలైంది. సాంట్నర్, ఫెర్గ్యుసన్‌కు మూడేసి, బౌల్ట్‌కు రెండు, హెన్రీ, రవీంద్రకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫిలిప్‌కు లభించింది.

ప్రజాశక్తి స్నేహ

పిల్లల ప్రత్యేక సంచిక

బాలల రచనలకు ఆహ్వానం!

ప్రియమైన చిన్నారులూ,

నవంబరు 14 బాలల దినోత్సవం, దీపావళి సందర్భంగా 'ప్రజాశక్తి' స్నేహ అనుబంధాన్ని మీ కోసం ఒక ప్రత్యేక సంచికగా తేవాలని నిర్ణయించాం. ఈ సంచికకు గెస్ట్ ఎడిటర్‌గా బాల సాహిత్యవేత్త, ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి గారు వ్యవహరిస్తారని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం.

ఇందులో మీరు రాసే రచనలకు, గీసే బొమ్మలకు ప్రాధాన్యం ఇచ్చి, ప్రచురిస్తాం. కథలు, కవితలు, బొమ్మలు, సమీక్షలు, వ్యాసాలు.. ఇలా అన్ని ప్రక్రియల్లోనూ మీ సృజనకు ఈ సంచికలో చోటు ఇస్తాం.

చంద్రయాన్, సోలార్ మిషన్, ప్లాస్టిక్ భూతం, మట్టి వాసన, పచ్చదనం, స్నేహం, ఐక్యత .. ఇలా ఏ అంశం అయినా తీసుకోండి. కథగానో, కవితగానో, కబుర్లుగానో అల్లేయండి. కనువిందు చేసే బొమ్మలూ గీసేయండి!

రచనలు క్లుప్తంగా ఉండాలని గుర్తుపెట్టుకోండి.

ఇంకా పెద్ద పెద్ద రచయితలు/ రచయిత్రులు కూడా చక్కని కథలు రాస్తారు. కబుర్లూ చెబుతారు.

గొప్ప గొప్ప చిత్రకారులు బొమ్మలు గీస్తారు. అవన్నీ మీ కోసమే!

ఇంకా ఇందులోనే గేయాలు, చిట్టిపొట్టి కథలు, పిల్లలు వేసే కార్టూన్లు కూడా ఉంటాయి.

మీరు కథో, కవితో రాయడంతో పాటు దానికి తగ్గట్టు బొమ్మలు కూడా గీయొచ్చు.

నవంబర్ 12న ఇచ్చే ఈ సంచిక మీకొక గొప్ప కానుకే కాదు; చక్కని జ్ఞాపకం కూడా అవుతుంది.

మీరంతా పదిలంగా దాచుకునేలా ఈ బాలల ప్రత్యేక సంచికను రూపొందిస్తాం.

దీనికి మీ సహాయం కావాలి. మీ భాగస్వామ్యం కావాలి.

ఎందుకంటే- ఈ సంచిక మీదే!

దీని రూపకర్తలూ మీరే!

మరి ఇంకెందుకు, ఆలస్యం?

పెన్ను తీసుకోండి. పెన్సిలు అందుకోండి.

కమ్మని కథలు రాయండి. చక్కని కవితలు అల్లండి.

అందమైన బొమ్మలు గీయండి.

బాగున్నాయ్ అని మీరు అనుకున్నాక- ఈ దిగువ ఇచ్చిన మెయిల్ ఐడికీ పంపేయండి.

ఇంకా ఏమన్నా అడగాలంటే..

83338 18985 నెంబరుకు కాల్ చేయండి.

- సంపాదకులు

మీ రచనలు పంపాల్సిన మెయిల్ ఐడి :
november14spl@gmail.com
రచనలు, బొమ్మలూ చేరాల్సిన చివరి తేదీ : 31 అక్టోబరు 2023.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68